జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

NEWS IS RIGHT

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
6-2-29/3/12, 3వ అంతస్థు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 4 సంచిక 47 | హైదరాబాద్, డిసెంబర్ 6 ఆదివారం 2020 | 8 పేజీలు | వెల : 5.00



## బీజేపీ గెలుపు తాత్కాలికమే : ఒవైసీ

హైదరాబాద్, డిసెంబరు 05 (ప్రజాపాలన) : జీహెచ్ఎంసీ ఎన్నికల్లో నగర ప్రజలు ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ ఇవ్వలేదని ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. ఆయన ఎన్నికల ఫలితాలపై శనివారం 'సాక్షి'తో మాట్లాడుతూ పాతబస్తీలో బీజేపీ ప్రభావం లేదని అన్నారు. ముస్లింలు, హిందువులు అందరూ ఎంఐఎంకు ఓటు వేశారని తెలిపారు. అయితే తమ పార్టీకి వచ్చిన ఫలితాలపై సమీక్ష జరుపుతున్నామన్నారు. గ్రేటర్‌లో బీజేపీ గెలుపు తాత్కాలికమేనని, దాని ప్రభావం రాష్ట్రంలో ఉండదని పేర్కొన్నారు. ఇక మేయర్ అభ్యర్థిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఒవైసీ అ?న్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల ప్రభావం రాష్ట్రంలో ఉండదని, తెలంగాణ ప్రజలకు కేసీఆర్‌పై ఎనలేని గౌరవం ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్, టీడీపీ బలహీనపడటం వల్లే బీజేపీ ఓట్ల శాతం పెరిగిందన్నారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఆయన తెలిపారు. కాగా ఎంఐఎం పాతబస్తీపై తమ పట్టును మరోసారి నిరూపించుకుంది. 44 స్థానాల్లో విజయకేతనం ఎగురవేసింది. 2016లోనూ ఎంఐఎంకు సరిగ్గా ఇన్ని సీట్లే రావడం గమనార్హం.

# వ్యవసాయ చట్టాలను సవరించనున్న కేంద్రం!



న్యూఢిల్లీ, డిసెంబరు 05 (ప్రజాపాలన) : రైతు ఆందోళనలు ఉధృతమైన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. వ్యవసాయ చట్టాలను సవరించాలని ప్రధాని మోదీ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. పంటల మద్దతు ధరకు హామీ, ప్రభుత్వ మార్కెట్ వ్యవస్థ బలోపేతంతో పాటు కాంట్రాక్టు వ్యవసాయానికి సంబంధించి సమస్యలు వస్తే సివిల్ కోర్టులకు వెళ్లే అవకాశం కల్పించే అవకాశాలపై కేంద్రం దిగొచ్చే అవకాశముందని ఢిల్లీ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ విషయంపై న్యాయ శాఖతో కూడా వ్యవసాయ శాఖ చర్చలు జరిపినట్లు సమాచారం. ఐదో విడత చర్చలు శనివారం ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం ప్రధాని నివాసంలో కేంద్ర మంత్రులు షా, రాజ్‌నాథ్, తోమర్, పీయూశ్ గోయల్ సమావేశమయ్యారు. ఈ సమావేశంలోనే కేంద్ర వ్యవసాయ చట్టాలను సవరించాలని డిసైడ్ అయినట్లు తెలుస్తోంది.

## 7న కేసీఆర్ ఉన్నతస్థాయి సమావేశం



హైదరాబాద్ , డిసెంబరు 05 (ప్రజాపాలన) : ఈ నెల 7వ తేదీ (సోమవారం) మధ్యాహ్నం 2 గంటలకు ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయం, ఆర్థికశాఖ అధికారులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈ యేడాది రెండవ విడత రైతుబంధు సహాయం కోసం నిధుల విడుదల, పంపిణీపై సీఎం ఈ సమావేశంలో సమీక్షించి నిర్ణయం తీసుకోనున్నారు. భేటీలో వ్యవసాయశాఖ మంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వ్యవసాయ, ఆర్థిక శాఖల ముఖ్య కార్యదర్శులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొంటారు.

## టీ పీసీసీ చీఫ్ రేసులో ముందున్నా: కోమటిరెడ్డి




హైదరాబాద్, డిసెంబరు 05 (ప్రజాపాలన) :తెలంగాణ పీసీసీ చీఫ్ రేసులో ముందున్నానని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. పీసీసీ చీఫ్ ఇస్తే కాంగ్రెస్ శక్తులను ఏకతాటిపైకి తెస్తానన్నారు. ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా ప్రజల తరపున పోరాడుతామని చెప్పారు. ఎల్‌ఆర్‌ఎస్ ప్రజలకు భారంగా మారిందన్నారు. ఈ ఎన్నికల ఫలితాలు చూసైనా ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేయాలని సూచించారు. వరదసాయం అందనివారికి మళ్లీ రూ. 10వేల సాయం చేయాలని డిమాండ్ చేశారు. వరద సాయం చేయకుంటే ప్రగతిభవన్‌ను ముట్టడిస్తామని ఎంపీ కోమటిరెడ్డి హెచ్చరించారు. కాగా తెలంగాణ పీసీసీ చీఫ్ పదవికి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసి వ్యాఖ్యలు సర్వత్రా ఆసక్తిని రేపుతున్నాయి.

## బంగారం.. గరం..గరం



(వివరాలు 5లో..)

## కోవిడ్ టీకాపై వత్తిడి చేయం: బైడెన్



అమెరికా, డిసెంబరు 05 (ప్రజాపాలన) : ఒకవేళ కరోనా వైరస్ టీకా అందుబాటులోకి వస్తే, అప్పుడు ఆ టీకాను తీసుకోవాలని అమెరికన్లపై వత్తిడి చేయబోమని ఆ దేశాధ్యక్షుడిగా ఎన్నికైన జో బైడెన్ తెలిపారు.

(మిగతా 3లో...)

# మరిన్ని నగరాలకు ఐటీ పరిశ్రమల విస్తరణ:కేటీఆర్



హైదరాబాద్,డిసెంబరు 05 (ప్రజాపాలన) : రాష్ట్రంలోని మరిన్ని నగరాలకు ఐటీ పరిశ్రమలను విస్తరించనున్నట్టు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె. తారక రామారావు తెలిపారు. శనివారం ప్రగతి భవన్‌లో రాష్ట్రంలోని ద్వితీయ శ్రేణి నగరాలకు ఐటీ విస్తరణపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్, ఖమ్మం, వరంగల్ నగరాలకు ఐటీ పరిశ్రమల విస్తరణకు ముమ్మర ఏర్పాట్లుచేసినట్టు తెలిపారు. కాగా వరంగల్ నగరంలో ఇప్పటికే పలు ఐటీ కంపెనీలు తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయని అన్నారు. మరికొన్ని ప్రముఖ కంపనీలు త్వరలోనే వరంగల్ నగరానికి రానున్నాయని తెలిపారు. దీని పై వారిలో చర్చలు జరుపుతున్నట్టు వెల్లడించారు. ఉప్పల్, నాచారం ఇండస్ట్రియల్ ఏరియాలో ఐటీ పార్క్‌ల నిర్మాణం పై ఈ సమావేశంలో చర్చించినట్టు తెలిపారు. రాష్ట్రంలో ఐటీ పార్క్‌ల నిర్మాణానికి సహకారం అందించాలని సీఎస్ సోమేశ్ కుమార్‌కు మంత్రి ఫోన్‌చేసి కోరారు. కొంపల్లిలో ఐటీపార్క్ నిర్మాణానికి భూసేకరణ చేయాలని టీఎస్ఐఐసీకి ఆదేశాలు జారీ చేశారు.

## రాహుల్‌గాంధీని కలుస్తా: జగ్గారెడ్డి



హైదరాబాద్: బీజేపీ గెలిచిన 48 సీట్లు.. భాగ్యలక్ష్మి అమ్మవారి గెలుపని కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. జీహెచ్ఎంసీలో కాంగ్రెస్ ఓటమికి పార్టీ నేతలంతా బాధ్యులేనని పేర్కొన్నారు. ఉత్తమ్ విలువ ఇప్పుడు తెలియకున్నా భవిష్యత్‌లో తెలుస్తుందన్నారు. పీసీసీ చీఫ్ పదవి కోసం సీరియస్‌గా ప్రయత్నిస్తున్నానని తెలిపారు. త్వరలో ఢిల్లీ వెళ్లి రాహుల్ గాంధీని కలుస్తానని పేర్కొన్నారు.

## బ్రాండ్ హైదరాబాద్ పేరుతో..
# అధిగమించాలని గులాబీ బాస్ భావించినా..




హైదరాబాద్, డిసెంబరు 05 (ప్రజాపాలన) : కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. అధికారం కూడా అంతే. ఒకరి చేతుల్లోనే శాశ్వితంగా ఉండదు. ఆ చిన్న విషయాన్ని గుర్తుపెట్టుకొని అహంభావానికి గురి కాకుండా.. ఆర్ధతతో ప్రజలమనసుల్ని గెలుచుకునే అధినేత ఎవరైనా.. తమ చేతిలోని అధికారాన్ని ఎప్పటికప్పుడు రెన్యువల్ చేసుకునే వీలుంటుంది. అందుకు భిన్నంగా నేనేం చేసినా చెల్లుతుంది? నేనేం చెప్పినా ప్రజలు వింటారన్న భావన ఒకే అయినా.. ఆ విశ్వాసం అంతకంతకూ పెరిగితే ఎదురుదెబ్బ తప్పదు. తాజాగా కేసీఆర్ పరిస్థితి అదే.బీజేపీ తీసుకొచ్చిన భావోద్వేగాల్ని..బ్రాండ్ హైదరాబాద్ పేరుతో అధిగమించాలని గులాబీ బాస్ భావించినా..ఎన్నికల వేళ ఆయన చెప్పే మాటలకు ఈసారి పప్పులు ఉడకలేదు సరికదా.. గతంలో ఎప్పుడూ ఎదురుకాని విషమ పరీక్ష ఇప్పుడు ఆయనకు ఎదురైంది. అడుగు ముందుకు వేస్తే నెయ్యి.. అలా అని వెనక్కి వేస్తే నుయ్యి లాంటి పరిస్థితి. గ్రేటర్ ఎన్నికల్లో మజ్లిస్ తమ మిత్రపక్షం కాదని.. వారితో పొత్తు లేదని అదే పనిగా చెప్పారు కేసీఆర్.. కేటీఆర్. దీనికి తగ్గట్లే మజ్లిస్ నేతలు సైతం టీఆర్ఎస్ పైన ఘాటు వ్యాఖ్యలు చేశారు.తాజా ఫలితాల నేపథ్యంలో ఇప్పటివరకు ఎదురుకాని ఇబ్బందికర పరిస్థితి గులాబీ బాస్ కు ఎదురైంది. సొంతంగా మేయర్ పీఠాన్ని సొంతం చేసుకోలేని రీతిలో పార్టీల బలాలు ఉన్నాయి. గ్రేటర్ లో 150 డివిజన్లు ఉంటే.. మేజిక్ మార్కు 76గా చెప్పాలి.కానీ.. ఎక్స్ అఫీషియో ఓట్లనుకూడా పరిగణలోకి తీసుంటే.. దాదాపు 99 ఓట్ల బలం అవసరం. ఇలాంటి పరిస్థితుల్లో టీఆర్ఎస్ కు 54 డివిజన్లు చేతిలో ఉండగా.. ఎక్స్ అఫీషియోసభ్యులుగా 38 మంది ఉన్నారు. ఇవన్నీ కలిపినా.. మేజిక్ సంఖ్యకు దూరంగా ఉన్నారు.అదే సమయంలో మజ్లిస్ 42 డివిజన్లలో గెలుపొందింది. వారికి 10 మంది ఎక్స్ అఫీషియో బలం ఉంది. వారు సైతం తమకుతాముగా మేయర్ పీఠాన్ని సొంతం చేసుకోలేరు. ఇలా ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాక.. హంగ్ పరిస్థితి నెలకొనటంతో.. మేయర్ పీఠం ఎవరికి సొంతం కానుందన్నది ఇప్పుడు ప్రశ్న.మేయర్ ఎంపికకు అవసరమైన మెజార్టీ ఏ పార్టీకి రాని వేళ.. ఎవరో ఒకరి మద్దతు పొందాల్సిన అవసరం టీఆర్ఎస్ కు ఉంది. అయితే.. మజ్లిస్ మద్దతు తీసుకోవాలి. అదే జరిగితే.. టీఆర్ఎస్ – మజ్లిస్ మధ్య ఉన్న మిత్రత్వాన్ని బహిరంగంగా ఒప్పుకోవాల్సి ఉంటుంది. అదే జరిగితే.. తెలంగాణలో టీఆర్ఎస్ పై ప్రతికూల ప్రభావాన్ని చూపించక మానదు.ఇప్పటికే బీజేపీ చేస్తున్న ఆరోపణలకు.. విమర్శలకు టీఆర్ఎస్ సమాధానం చెప్పలేని పరిస్థితి. అలాంటిది.. మజ్లిస్ తో కలిసి గ్రేటర్ పీఠాన్ని దక్కించుకుంటే రాజకీయంగా జరిగే నష్టం భారీగా ఉంటుంది. అలా అని.. మజ్లిస్ కు దూరంగా ఉంటానని ఊరుకుంటే.. మేయర్ పీఠం చేజారుతుంది. ఇలాంటివేళ.. టీఆర్ఎస్ కు మజ్లిస్ బయట నుంచి మద్దతు తీసుకునే అవకాశమే మిగిలింది. అలా చేసినా.. కేసీఆర్ విమర్శల్ని ఎదుర్కోక తప్పదు. ఇప్పటివరకు ఇలాంటి సంకట స్థితి కేసీఆర్ కు ఎదురుకాలేదు.



## గురుకుల పాఠశాలలకు ఎంపికైన సిరిపురం విద్యార్థులు



**మధిర, డిసెంబర్ 5, ప్రజాపాలన :** మధిర మండలం సిరిపురంఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గురుకుల పాఠశాల 5వ తరగతి ప్రవేశ పరీక్షల్లో 12 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 12 మంది క్రింది గురుకుల పాఠశాలల్లో సీట్లు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూర్యదేవర శివరామకృష్ణ తెలిపారు. రేవంత్, అబిలాష్ ఏన్కూరు, లావణ్య, జస్వంతి వైరా, ప్రశాంత్ కుమార్, ప్రవీణ్, చంటి ముదిగొండ, రోహిత్ తిరుమలాయపాలెం, మణికంఠ అన్నపురెడ్డిపల్లి, రిషిత, సౌజన్య, వర్ధిని బోనకల్ గురుకుల పాఠశాలల్లో సీట్లు సాదించారు. ఒకే పాఠశాలలో ఇంతమంది విద్యార్థులు సీట్లు సాదించడం పట్ల ప్రభాకర్ గారు, గ్రామ సర్పంచ్ పెదబుచ్చయ్య గారు పాఠశాల ఉపాధ్యాయులను మరియు విద్యార్థులను అభినందించారు.

## జీవాలలో డి వార్మింగ్ క్యాంపుల నిర్వహణ

**మధిర, డిసెంబర్ 5, ప్రజాపాలన :** మధిర మండలంలో జిలుగుమాడు, రాయపట్నం,గ్రామాల లో లిగొర్రెలు మేకలలో ఉచిత నట్టల నివారణలి శిబిరాలు నిర్వహించినారు. ఈ కార్యక్రమం రాయపట్నం గ్రామంలో గ్రామ సర్పంచ్ నంద్రు సుశీల మరియు ఉప సర్పంచ్ మార్నిడు పుల్లారావు ప్రారంభించినారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గొర్రెల పెంపకం తో ఆర్థికంగా లబ్ధి పొందవచ్చని తెలిపారు . ఈ శిబిరాలలో పశు వైద్యాధికారి డాక్టర్ వంశీ ,వి ఎల్ వో లు లక్ష్మణ్, లక్ష్మయ్య ,,జై వివో కొండలరావు మరియు స్టాఫ్ భాస్కర్ ,కరిమున్, సాయి చంద్రకళ ,జాన్ బీ, మరియు గొర్రెల పెంపకం దారులు పాల్గొన్నారు.

## అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న



**మధిర, డిసెంబర్ 5, ప్రజాపాలన :** కోమటిడి రంగారావు జ్ఞాపకార్థం వారి సతీమణి లక్ష్మి సీతమ్మ, కుమారులు కోమటిడి నరసింహారావు, కోమటిడి శ్రీనివాసరావు మధిర సేవాసమితి ఉపాదక్షులు, శివాలయం మాజీ చైర్మన్ వసంతమ్మ సేవాసదనము మానసిక దివ్యాంగుల వసతి గృహంలో అన్నవితరణ చేసినారు. ఈ కార్యక్రమంలో కోమటిడి శ్రీనివాసరావు మాట్లాడుతు ఈ రోజున మానసిక వికలాంగులకు అన్నదానం చేయటం నాకు ఎంతో సంతృప్తి కరంగా ఉన్నదని తెలిపారు.

## పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్



**మధిర, డిసెంబర్ 5, ప్రజాపాలన :** మధిర మునిసిపల్ కమీషనర్ ఎ.రమాదేవి గారు మున్సిపల్ పరిధిలోని చర్చ్ ఏరియాలో పారిశుధ్యం పనులను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా మునిసిపల్ కమీషనర్ ఎ. రమాదేవి మాట్లాడుతూ పరిసరాలు శుభ్రముగా ఉంచుకోవాలని ప్రజలకు తెలిపినారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ ఎ.రమాదేవి వెంట శానిటరీ జవాన్ దానయ్య ఉన్నారు.

# యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

### వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 5 (ప్రజాపాలన) :** యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ హితవు పలికారు. శనివారం మున్సిపల్ పరిధిలో గల 21వ వార్డు కౌన్సిలర్ తోకల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రామయ్య గూడ ఎంఐజిలో శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల గ్రౌండ్ లో వాలీబాల్ పోటీలు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... నిర్వాహకులు వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని, ఇలాంటి క్రీడలు యువతకు ఎంతో అవసరమన్నారు. నేటి యువత చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. రాష్ట్రంలో క్రీడల్లో రాణించే విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. క్రీడల్లో యువతను ప్రోత్సహించాల్సిన బాధ్యత మన అందరిపైన ఉందన్నారు. కాగా కార్యక్రమం నిర్వహించిన కౌన్సిలర్ కృష్ణారెడ్డి, నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ విజయ్ కుమార్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేష్ కుమార్, కౌన్సిలర్లు నర్సింలు, అనంత్‌రెడ్డి, కుమ్మర్పల్లి గోపాల్ ముదిరాజ్, రాములు, శివారెడ్డిపేట పిఏసిఎస్ వైస్ చైర్మన్ గడ్డమీది పాండు ముదిరాజ్, పట్టణ కోశాధికారి మాలె లక్ష్మణ్, నాయకులు శ్రీనివాస్ గౌడ్, పిరంగి కాశయ్య, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**మధిర, డిసెంబర్ 5, ప్రజాపాలన :** మండల పరిధిలోని ఇల్లూరు గ్రామంలో శుక్రవారం జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తేమశాతం తక్కువ ఉన్న ధాన్యాన్ని తీసుకువచ్చి గిట్టుబాటు ధర వచ్చేలా చూసుకోవాలని రైతులకు సూచించారు. ఆరబెట్టిన ధాన్యాన్ని తీసుకోవడం వలన రైతులకు అనుకూలమైన ధరకు కొనుగోలు చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తూరు నాగేశ్వరరావు, మండలాధ్యక్షులు రావూరి శ్రీనివాస రావు, ఆత్మ కమిటీ చైర్మన్ రంగిశెట్టి కోటేశ్వరరావు, టిఆర్ఎస్ నాయకులు చావా వేణు, కోన నరేందర్ రెడ్డి, ఇల్లూరు సర్పంచ్ కోట రామారావు, మాజీ సర్పంచ్ జ్వాలాది రంగారావు, మెట్ల ప్రసాదు, గోవిందరాజులు పాల్గొన్నారు.

## నేలను సంరక్షించి జీవవైవిధ్యాన్ని కాపాడుకోవాలి

### కృషి విజ్ఞాన కేంద్రం, బెల్లంపల్లి - ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. రాజేశ్వర్ నాయక్



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 5, ప్రజాపాలన :** నేలను సంరక్షించు కుని మానవ జీవవైవిధ్యాన్ని కాపాడుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం, బెల్లంపల్లి – ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. రాజేశ్వర్ నాయక్ కోరారు. శనివారం ప్రొఫెసర్ జయ శంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి కృషి విజ్ఞాన కేంద్రం, బెల్లంపల్లి ఆధ్వర్యంలో ప్రపంచ నేల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేల ఆవిర్భావం, నేల రక్షణ, జీవవైవిధ్యం ప్రాముఖ్యత గురించి రైతులకు వివరించారు. విచక్షణా రహితంగా రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడటం వల్ల భూమిలోని సూక్ష్మ జీవులు నశించి నేల సారం తగ్గుతున్నందున సేంద్రీయ ఎరువులు వాడాలని సూచించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న గోనెశ్యామ్ సుందర్ రావు మాట్లాడుతూ జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవడానికి సమగ్ర పోషక యాజమాన్యం తో పాటు సమగ్ర వ్యవ సాయ విధానాలు పాటించాలని చూసించారు. సేంద్రీయ వ్యవసాయం పైన అవగాహన పెంపొందించడంలో కృషి విజ్ఞాన కేంద్రం, బెల్లంపల్లి కి అనుబంధ పరిచిన "రావెప్" విద్యార్థుల సహకారంతో ముందుకు నడవాలని రైతులకి పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న మరో అతిథి తొంగల సత్య నారాయణ మాట్లాడుతూ, రైతులు దళారులు, వ్యాపారుల చేతుల్లో మోసపోకుండా శాస్త్రవేత్తల సలహాలను పాటించాలని సూచించారు. ఎంపీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ, జీవన ఎరువులు వాడి భూసారం పెంచుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వినోద్ కుమార్ మాట్లాడుతూ భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా రసాయనిక ఎరువులు వాడాలని, విచక్షణా రహితంగా ఎరువులు వాడటం వల్ల భూమిలోని ఉదజని సూచిక లో మార్పులు సంభవించి పంట సాగు ప్రశ్నార్థకం అయ్యే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. డిఆర్డిఎ అడిషనల్ డైరెక్టర్ శేషాద్రి మాట్లాడుతూ చెరువు మట్టి పంటపొలాలలో వేసుకుని భూసారాన్ని పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం, బెల్లంపల్లి శాస్త్రవేత్తలు డా. శివకృష్ణ, నాగరాజు, డా.తిరుపతి, స్రవంతి, డా. సతీష్, మహేష్, స్థానిక సహాయ వ్యవసాయ సంచాలకులు సురేఖ, కోరమాండల్ సీనియర్ అగ్రానమిస్ట్ రుక్మాంగదర రెడ్డి , సిబ్బంది, సిర్పూర్ పేపర్ మిల్లు సిబ్బంది, బుధకుర్ధ్ , మాలగురిజాల్ సర్పంచులు లక్ష్మి , అశోక్ లతో పాటు 150 మంది రైతులు పాల్గొన్నారు.

## సునీతారెడ్డి ఆధ్వర్యంలోనే నా గెలుపు : పూజిత జగదీశ్వర్ గౌడ్



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 05 ( ప్రజా పాలన ) :** సునీతారెడ్డి వల్లే నా గెలుపు సుసాధ్యమయ్యిందని హఫీజ్ పేట నూతన కార్పోరేటర్ పూజిత జగదీశ్వర్ గౌడ్ శనివారం ఒక ప్రకారంటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలతో పాటు సునీతారెడ్డి చేసిన ప్రచారం వలనే తన గెలుపు సునాయాసం అయ్యిందని అన్నారు. శనివారం హైదరాబాద్ లోని సునీతారెడ్డి ఇంటికి వచ్చిన ఆమె జడ్పి చైర్ పర్సన్ ను కలిసి శాలువా కప్పి సన్మానించారు. తన గెలుపులో ప్రధాన భూమిక పోషించిన సునీతారెడ్డికి రుణపడి ఉంటానని అన్నారు. ఈ సంధర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. జడ్పి చైర్ పర్సన్ మాట్లడుతూ.. స్థానిక ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టాలని కార్పొరేటర్ కు సూచించారు.

## కార్మిక కర్షక రైతు బిల్లు వ్యతిరేకిస్తూ మోడీ దిష్టిబొమ్మ దగ్ధం



**పాలేరు నేలకొండపల్లి డిసెంబర్ 5 ప్రజాపాలన :** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం నేలకొండపల్లి పొట్టి శ్రీరాములు సెంటర్లో కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక నిర్ణయాలకు వ్యతిరేకంగా ప్రధాన మంత్రి మోడీ దిష్టి బొమ్మను తగలు పెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకుడు కర్నాటి భానుప్రసాద్,సిపిఎం మండల కార్యదర్శి గుడవర్తి నాగేశ్వరరావు, సిపిఐ నేలకొండపల్లి గ్రామ కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా నాయకులు సివై పుల్లయ్య, పగిడికత్తుల రామదాసు, సిపిఎం నాయకులు పగిడికత్తుల నాగేశ్వరరావు ,యం ఆర్ పి యస్ మండల అధ్యక్షుడు వడ్లమూడి వెంకటేశ్వరరావు ఇంకా తదితర నాయకులు పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ పురోగమనం - తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ తిరోగమనం



**బాలాపూర్ : ప్రజాపాలన న్యూస్ :** గత శాసన సభ ఎన్నికల తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ పంచాయతీ సర్పంచ్ మరియు వార్డు సభ్యుల విజయం లో పురోగతి సాధించింది.. అలాగే ఎంపీటీసి ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు గెలిచి, ఏకంగా కందుకూరు ఎంపీపీ పదవిని కైవసం చేసుకున్నారు. ఈ సంవత్సరం జనవరిలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో తుక్కుగూడ మున్సిపాలిటీలొ 15 వార్డులకు గాను, 9 వార్డులలో విజయ ఢంకా మోగించింది. తెలంగాణ రాష్ట్రం మొత్తానికి తెలిసిందే. బడంగ్ పేట్, మీర్ పేట కార్పొరేషన్ ఎన్నికల్లో అధికార పార్టీకి దీటుగా కార్పొరేటర్లు ను గెలిపించుకొని టిఆర్ఎస్ పార్టీకి సవాల్ విసిరింది. అధికారం కొసం అడ్డదారులు తొక్కాల్సిన పరిస్థితి తీసుకువచ్చింది. తాజాగా జిహెచ్ఎంసి ఎన్నికల్లో సిట్టింగ్ స్థానం అయిన రామక్రిష్ణపురం డివిజన్ లొనీ పార్టీ పటిష్టంగా ఉంది. గత ఎన్నికల్లో స్థానిక టిఆర్ఎస్ శాసన సభ్యుని కుటుంబ సభ్యులనే ఓడించింది. తాజాగా జరిగిన, నిన్న ప్రతిపక్షాలు జిహెచ్ఎంసి ఎన్నికల్లో స్థానిక మంత్రి నియోజకవర్గం లోని అభ్యర్థిని కి మరియు పక్క జిల్లాల వారిని మోహరించిన విషయం అందరికి తెలిసిందే, కానీ బిజెపి విజయాన్ని ఆపలేకపోయారు. అదేవిధంగా సరూర్ నగర్ డివిజన్ లొనీ అందరి అంచనాలను తలకిందులు చేస్తూ, భారతీయ జనతా పార్టీ ఘనవిజయాన్ని సొంతం చేసుకుంది. ఈ రెండు డివిజన్ లలో గెలుపుతొ పార్టీ మహేశ్వరం నియోజకవర్గంలో ఎదురు లేని శక్తిగా ఎదిగింది. భారతీయ జనతా పార్టీ నియోజకవర్గ నాయకుని పట్ల ప్రజల్లో విశ్వాసం పెరుగుతూనే... వస్తుంది. అధికార పార్టీలొ ఉన్నా, స్థానిక మంత్రిపైన ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతుంది బడంగ్పేట్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్ రెడ్డి అన్నారు. నిదర్శనం ఇటీవలి విజయాలే సాక్షం. రానున్న అసెంబ్లీ 2023 సంవత్సరంలో ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ మహేశ్వరం నియోజకవర్గం లొ విజయం సాధించె దిశగా అందరు నాయకులు, కార్యకర్తలు క్రృషి చేయాలని కోరుతూ.... అలాగే జిహెచ్ఎంసి ఎన్నికల్లో రామక్రిష్ణ పురం, సరూర్ నగర్ డివిజన్ లతో పాటు ఎల్బీనగర్ నియోజకవర్గంలోని డివిజన్ లలో పార్టీ అభ్యర్థుల విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేసిన బడంగ్ పేట్ కార్పొరేషన్ పరిధిలోని రాష్ట్ర, జిల్లా మరియు కార్పొరేషన్ లోని నాయకులకు ముఖ్య కార్యకర్తలకు, కార్పొరేటర్లకు, బ్యాంకు డైరెక్టర్లకు అందరికీ పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు కార్పొరేషన్ అధ్యక్షులు చెరుపల్లి వెంకటరెడ్డి అందరికీ తెలియజేశారు.

## బిజెపి నైతిక విజయం

**- నాయిని పవన్ రావు**



**కూకట్ పల్లి:( ప్రజా పాలన) :** హైదరాబాద్ ఎన్నికల్లో ప్రజలంతా భారతీయ జనతా పార్టీని పూర్తిగా నమ్మడం వల్లే అన్ని ప్రాంతాలలో బీజేపీ అభ్యర్థులకు బలమైన ఓటుబ్యాంకు లభించిందని కూకట్పల్లి డివిజన్ బిజెపి అభ్యర్థి అని పేర్కొన్నారు. శనివారం కూకట్పల్లిలోని బిజెపి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో పవన్ రావు మాట్లాడుతూ డివిజన్ ప్రజలంతా బిజెపికి మద్దతు తెలిపి భారీగా ఓట్లు వేశారని స్వల్ప తేడాతో ఓటమి పాలైంది ఇప్పటికీ తాను నైతికంగా విజయం సాధించినట్లు స్పష్టం చేశారు. డివిజన్ పరిధిలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోని వారినీ ప్రజలు నమ్మ వద్దన్నారు. క్రమశిక్షణ గల పార్టీగా ప్రజల్లో గుర్తింపు పొందిన బిజెపినీ ప్రజలు నమ్మాలని తాను కార్పొరేటర్గా గెలవక పోయినా డివిజన్ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎలాంటి సమస్య తలెత్తినా తన దృష్టికి తీసుకువస్తే ప్రతిపక్ష హొదాలో ప్రత్యేక చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో ప్రజల పక్షాన నిలబడి ప్రతి సమస్యపై ప్రజలకు న్యాయం చేకూరే వరకు ప్రజాప్రతినిధులు మెడలు వంచి పనులు చేయిస్తామని భరోసా ఇచ్చారు. ప్రజలు అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.


ప్రజాపాలన

జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.

బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు

| | | | | |
|---|---|---|---|---|
| తల్లనారాయణ దాస్ | - | చేవెళ్ల | - | 9849526878 |
| డి. వరప్రసాద్ | - | తెల్లాపూర్ | - | 9553999990 |
| గణేష్ | - | బాలాపూర్ | - | 7993047109 |
| నరోత్తమ్‌రెడ్డి | - | మేడిపల్లి | - | 9346970159 |
| వెంకటచారి | - | మందమర్రి | - | 9440868581 |
| పి. లక్ష్మీనారాయణ గౌడ్ | - | కొల్చారం | - | 9912532909 |
| వెంకటస్వామి | - | మంచిర్యాల | - | 9515048103 |
| టి. సురేష్‌చారి | - | ఆసిఫాబాద్ | - | 9000983108 |
| అన్వర్ బాషా | - | కుత్బుల్లాపూర్ | - | 7993047109 |
| కళ్యాణ్ సి.ఎం. | - | కూకట్‌పల్లి | - | 7842672389 |
| ఎం. గైబులు | - | వికారాబాద్ | - | 9704570475 |

# అభ్యుదయ కళా సేవ సమితి ఆధ్వర్యంలో ఘనంగా పద్మశ్రీ ఘంటసాల 98వ జయంతి వేడుకలు

## పాటకు జీవం పోసిన అజరామర గానగంధర్వుడు ఘంటసాల

## అభ్యుదయ కళా సేవా సమితి జిల్లా అధ్యక్షుడు మద్దెల శివ కుమార్








భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, డిసెంబరు 05 (ప్రజాపాలన) :పాట అనే పదానికి తన మధురమైన అమృతతుల్యమైన గళంతో ప్రాణ ప్రతిష్ట చేసి నవరసాలను తన కంఠంతో మధుర సాలు గాఒలీ కించి పలికించి మూడు దశాబ్దాలుగా 10 వేల పాటలకు పైగా సంగీతాభిమానులకు అందించి దాదాపు 100 సినిమాలకు పైగా స్వయంగా సంగీత దర్శకత్వం వహించి తన మధుర గానంతో సుమధుర సంగీతం తో ఎన్నో హిట్ చిత్రాలను అందించిన బహుముఖ ప్రజ్ఞాశాలి పాటల పాఠశాల మన అందరి అభిమాన ఘంటసాల అజరామర గానగంధర్వుడు అని అభ్యుదయ కళా సేవా సమితి జిల్లా అధ్యక్షుడు మద్దెల శివ కుమార్ ఉద్ఘాటించారు 04 12. 2020 నాడు గాన గంధర్వుడు ఘంటసాల గారి 98వ జయంతి సందర్భంగా స్థానిక బస్టాండ్ సెంటర్ లో గల సంఘ కార్యాలయంలో అభ్యుదయ కళా సేవా సమితి జిల్లా అధ్యక్షుడు మద్దెల శివ కుమార్ నేతృత్వంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత స్వర్గీయ ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ సంగీత దర్శకులు మా రపాక కృష్ణస్వామి మాట్లాడుతూ ఘంటసాల గారి గానం సంగీతం సంగీత అభిమానుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని పాట ఉన్నంత వరకు ఘంటసాల కీర్తి నిలిచి ఉంటుందని ఈ విధంగా ఎన్నెన్నో గొప్ప సాంస్కృతిక సంగీత సామాజిక సేవా కార్యక్రమాలను అందిస్తున్న బహుముఖ ప్రజ్ఞాశాలి మద్దెల శివ కుమార్ అందరికీ ఆదర్శ ప్రాయుడని తెలంగాణ బాలోత్సవ్ ద్వారా కూడా చిన్నారులను ఎందరినో కళారంగంలో ప్రోత్సహిస్తున్నారని మద్దెల ధన్యజీవి అని ప్రశంసించారు .అనంతరం సింగరా ఫ్ సింగరేణి అపర బాలు అలీ శంకర్ మరియు మద్దెల శివకుమార్ లు హృద్యంగా ట్రాక్స్ పై ఆలపించిన ఘంటసాల గారి గీతాలు అందరినీ అలరించాయి. ప్రముఖ కళాకారుడు కొండ జంపన్న ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు .ఈ కార్యక్రమంలో మద్దెల శివ కుమార్ తో పాటు ప్రముఖ సంగీత దర్శకులు మారపాక కృష్ణస్వామి సింగర్ ఆఫ్ సింగరేణి అపర బాలు అల్లి శంకర్ ప్రముఖ కళాకారులు రిటైర్డ్ హెచ్.ఎం జి వివి ప్రసాద్ సంఘ నాయకులు మందా హనుమంతు చంద్రగిరి గోపీచంద్ మూడు బాలు లావుడియా సత్యనారాయణ కొండ జంపన్న గౌరవాధ్యక్షులు నయీమ్ ఖురేషీ పి సురేందర్ గౌరవ సలహాదారులు సింగరేణి లైజన్ ఆఫీసర్ కలవల చంద్రశేఖర్ డిష్ రాజు టి జోసెఫ్ మణి జక్కుల రాజేశ్వరరావు సంఘ మహిళా నాయకురాలు నక్క సృజన గాయత్రి కృపా వేణి శ్రీకాంత్ కుమార్ పాల్గొన్నారు .

# కోవిడ్ టీకాపై వత్తిడి చేయం: బైడెన్

(మొదటి పేజీ తరువాయి)

అమెరికన్లు అంతా మాస్క్‌లు ధరించాలని తాజాగా ఆ దేశానికి చెందిన అంటువ్యాధుల నివారణ సంస్థ ఆదేశాలు జారీ చేసింది. వైరస్ సంక్రమణ దేశంలో అత్యధిక స్థాయిలో ఉన్నట్లు సీడీసీ పేర్కొన్న నేపథ్యంలో బైడెన్ ఈ కామెంట్ చేశారు. శుక్రవారం అమెరికాలో కొత్త గా 2500 మంది మరణించారు. సుమారు 2.25 లక్షల పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. విల్మింగ్టన్‌లోని డెలావేర్‌లో మాట్లాడిన బైడెన్.. కరోనా వైరస్ వ్యాక్సిన్‌ను తప్పనిసరి చేయడం లేదన్నారు. అయితే అధ్యక్షుడి హోదాలో ప్రజలు సరైన చర్యలు తీసుకునేలా చేస్తానని బైడెన్ అన్నారు. సుమారు 60 శాతం మంది అమెరికన్లు వ్యాక్సిన్ తీసుకునేందుకు ఆసక్తిగా ఉన్నట్లు పీవ్ రీసర్చ్ సెంటర్ తెలిపింది.

# విద్వేషాలను రెచ్చగొట్టి లబ్ధిపొందిన బీజేపీ, ఎంఐఎం: మంత్రి ఎర్రబెల్లి




హైదరాబాద్: జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో విద్వేషాలు రెచ్చగొట్టి బీజేపీ, ఎంఐఎం లబ్ధిపొందాయని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఎంఐఎంతో పొత్తు లేకుండానే గ్రేటర్ మేయర్ పీఠాన్ని దక్కించుకుంటామని చెప్పారు. వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కొత్తగా కొనుగోలు చేసిన ట్రాక్టర్లు, కంప్రెషర్, క్లీనింగ్ యంత్రాలను మంత్రి ప్రారంభించారు. గ్రేటర్ ఎన్నికల్లో టీఆర్ఎస్ అతిపెద్ద పార్టీగా అవతరించిందని చెప్పారు. తెలంగాణలో టీఆర్ఎస్‌కు ఎదురులేదని జీహెచ్‌ఎంసీ ఎన్నికలతో మరోసారి నిరూపితమయ్యిందన్నారు. విద్వేషాలను రెచ్చగొట్టడం వల్లే ఆ రెండు పార్టీలు ఎక్కువ సీట్లు గెలుపొందాయని విమర్శించారు. అంతకుముందు గ్రేటర్ ఎన్నికల్లో విజయం సాధించిన మీర్‌పేట హౌసింగ్ బోర్డ్ టీఆర్ఎస్ అభ్యర్థి ప్రభుదాస్ మర్యాదపూర్వకంగా మంత్రిని కలిశారు. తన గెలుపునకు సహరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. దీంతో మీర్‌పేట హెచ్‌బీ కాలనీ డివిజన్‌ను తాను దత్తత తీసుకుంటున్నాని మంత్రి ప్రకటించారు.

# అలా అయితే 100 సీట్లు గెలిచేవాళ్లం : బండి సంజయ్



హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్‌ఎంసీ) ఎన్నికల్లో ఎన్నికల సంఘం ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పినట్లు నడిచిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ విమర్శించారు.. రిగ్గింగ్ కోసమే బ్యాలెట్ పేపర్లు పెట్టారని ఆరోపించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీజేపీని తక్కువ అంచనా వేసిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పారని విమర్శించారు. ఎన్నికలు హడావుడిగా నిర్వహించకపోతే బీజేపీ వందకు పైగా స్థానాల్లో గెలిచి, మేయర్ పీఠం సాధించేవాళ్లమని చెప్పారు. టీఆర్ఎస్ అడ్డదారిలో వెళ్లి గెలిచేందుకు ప్రయత్నించి విఫలమైందని విమర్శించారు. ఎంఐఎంకు బీజేపీ అడ్డుకునే స్థాయి లేదన్నారు. హైదరాబాద్ పేరును భాగ్యనగరంగా మార్చాలన్న బీజేపీ వాదాన్ని ప్రజలు సమర్థించారన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి కేసీఆర్ తీరుమార్చుకోవాలని, లేదంటే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కేంద్రం నిధుల విషయంలో హైదరాబాద్ అభివృద్ధికి సహకరిస్తామని బండి సంజయ్ పేర్కొన్నారు. ఇక జానారెడ్డి బీజేపీలో చేరతారనే అంశంపై స్పందిస్తూ. ఆయన నుంచి ఎటువంటి ఫోన్ కాల్ రాలేదన్నారు. అలాగే ఢిల్లీ పెద్దల సమక్షంలో సోమవారం విజయశాంతి బీజేపీలో చేరుతున్నారని వెల్లడించారు. కాగా, జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో నగర ఓటరు ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ ఇవ్వలేదు. టీఆర్ఎస్-55, బీజేపీ-48, ఎంఐఎం-44, కాంగ్రెస్-2 స్థానాల్లో విజయం సాధించింది.

# జాబిల్లిపై డ్రాగన్ జెండా..



బీజింగ్: చంద్రుడిపై మొదట జాతీయ పతాకాన్ని రెపరెపలాడించిన దేశం అమెరికా. ఆ తర్వాత ఈ ఘనత సాధించిన రెండో దేశంగా చైనా నిలిచింది. డ్రాగన్ దేశానికి చెందిన అంతరిక్ష నౌక చాంగె%--%5 చంద్రుడి మీద కాలుమోపిన సంగతి తెలిసిందే. జాబిల్లి మీద నుంచి మట్టిని సేకరించిన ఈ నౌక చంద్రుడి ఉపరితలం మీద తన జెండాను పాతింది. శనివారం ఇందుకు సంబంధించిన ఫోటోలను ఆ దేశ స్పేస్ ఏజెన్సీ రిలీజ్ చేసింది. 1970 తర్వాత మొదటి ప్రయత్నంలోనే చంద్రుడి మీద మట్టిని సేకరించిన దేశంగా చైనా రికార్డు సృష్టించింది. 21 వ శతాబ్దంలో చంద్రుడి నుంచి శాంపిళ్లను సేకరించిన మూడో దేశంగా అమెరికా, రష్యాల సరసన చైనా నిలిచింది. ఇక చంద్రుడిపై జెండా ఎగురవేసిన తొలి దేశంగా అమెరికా రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే. 1969లో చేపట్టిన అపోలో మిషన్‌లో భాగంగా మొదటిసారి అమెరికా తన జాతీయ జెండాని చంద్రుడి ఉపరితలం మీద రెపరెపలాడించింది. మనుషులను జాబిల్లిపైకి తీసుకెళ్లేందుకు రూపొందించిన ఈ మిషన్‌లో భాగంగా అమెరికా 12 మంది వ్యోమగాములను చంద్రుడి మీదకు తీసుకెళ్లింది. 1969 నుంచి 1972 వరకు ఆరు స్పేస్‌క్రాఫ్ట్‌ల్లో వీరిని చంద్రుడిపైకి తీసుకెళ్లారు. ఇక తిరిగి వచేటప్పుడు వీరు చంద్రుడి ఉపరితలం మీద నుంచి 382 కిలోగ్రాముల రాళ్లు, మట్టిని తమతో తీసుకొచ్చారు. చైనాకు చెందిన చాంగె-5 స్పేస్‌క్రాఫ్ట్ గత నెల 23న చంద్రుడి మీద ల్యాండ్ అయిన సంగతి తెలిసిందే. మంగళవారం చాంగె -5 అంతరిక్ష నౌక ఒక జత ల్యాండింగ్, అసెండింగ్ వెహికల్స్‌ని చంద్రుడి ఉపరితలంపై విజయవంతంగా మోహరించింది. 2 కిలోల (4.4 పౌండ్ల) నమూనాలను సేకరించింది. మట్టిని సురక్షితంగా తీసుకొచ్చేందుకు పటిష్టమైన కంటెయినర్‌ను వాడాల్సి ఉంటుందని చైనా శాస్త్రవేత్తలు చెప్పారు.

# సంపాదన రూ. 198.. 3.5 కోట్ల మేర పన్ను ఎగవేత!

రాంచీ: రోజుకు 198 రూపాయలు సంపాదించే కూలీకి జీఎస్టీ డిపార్టుమెంటు భారీ షాకిచ్చింది. అక్షరాలా మూడున్నర కోట్ల మేర పన్ను ఎగవేశారంటూ నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలో సదరు కూలీ ఇంటికి చేరుకున్న పోలీసులు గురువారం ఆయనను అరెస్టు చేశారు. వివరాలు.. జార?ండ్‌లోని తూర్పు సింగ్‌భూం జిల్లాలోని రాణీపహారీ గ్రామానికి చెందిన లాడన్ ముర్ము నిరుపేద. తన కుటుంబంతో కలిసి పూరి గుడిసెలో నివసిస్తున్నాడు. జాతీయ ఉపాధి హామీ పథకం లబ్దిదారుడైన అతడు కూలీగా పనిచేస్తూ జీవనం గడుపుతున్నాడు. ఈ క్రమంలో గతేడాది సెప్టెంబరులో కమర్షియల్ టాక్స్ ఆఫీసర్లు ఆయన ఇంటికి వచ్చారు. ఎంఎస్ స్టీల్ కంపెనీ ఎండీ అయిన ముర్ము రూ. 3.5 కోట్ల మేర పన్ను ఎగవేతకు పాల్పడ్డారని, ఈ మొత్తం చెల్లించకపోతే చట్టపరంగా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో పలుమార్లు ఆయనకు నోటీసులు జారీ చేయగా.. కంపెనీ గురించి తనకేమీ తెలియదని, తన వద్ద డబ్బు లేదని సమాధానమిచ్చారు. దీంతో గురువారం ముర్ము ఇంటికి చేరుకున్న పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. గ్రామస్తుల నుంచి ప్రతిఘటన ఎదురుకావడంతో సాయంత్రం విడిచిపెట్టారు. ఈ ఘటన జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ విషయం గురించి ఎస్ఎస్‌పీ డాక్టర్ ఎం. తమిల్ వణన్ మాట్లాడుతూ.. "గతేడాది తాము పంపిన నోటీసులకు బదులివ్వని కారణంగా ఎంఎస్ స్టీలు కంపెనీ ఎండీ లాడన్ ముర్ముపై జీఎస్టీ డిపార్టుమెంటు ఫిర్యాదు చేయగా, ఎఫ్ఐఆర్ నమోదు చేశాం. దీంతో మా బృందం గురువారం ఆయన ఇంటికి చేరుకుంది. ఎంజీఎన్ఆర్ఈఏ పథక లబ్దిదారు అయిన ముర్ము పాన్, ఆధార్ కార్డును ఉపయోగించి కొంతమంది ఉద్దేశపూర్వకంగానే మోసానికి పాల్పడ్డట్లు తెలిసింది. లోతుగా దర్యాప్తు చేస్తున్నాం" అని వెల్లడించారు.

ఇక బాధితుడు ముర్ము స్పందిస్తూ.. "వరుసకు కుమారుడయ్యే బైలా ముర్ము 2018లో నా కో-ఆపరేటివ్ బ్యాంకు పాస్‌బుక్, పాన్, ఆధార్ కార్డు తీసుకున్నాడు. నా అకౌంట్‌ను ప్రభుత్వం ప్రతినెలా రూ. 2 వేలు జమచేస్తుందని చెప్పాడు. ఈ పత్రాలన్నింటిని తన అల్లుడు సునరం హేంబ్రంకు ఇచ్చినట్లు తెలిసింది. సునరం వీటిని జంషెడ్‌పూర్‌కు చెందిన సుశాంత్ కుమార్ సమాంటోకు ఇచ్చాడట. వాటితో వాళ్లు ఏం చేశారో నాకు తెలియదు. జీఎస్టీ శాఖ నాకు నోటీసులు ఇచ్చింది. దీంతో జంషెడ్‌పూర్‌లోని జీఎస్టీ కోర్టుకు హాజరై వాంగ్మూలం ఇచ్చాను. నా పేరు మీద ఉన్న కంపెనీ గురించి, దాని లావాదేవీలతో సంబంధం లేదని చెప్పాను. నేను రోజూవారీ కూలీని. పనిచేస్తేనే ఆరోజు నా కడుపు నిండుతుంది. గతేడాదే నా భార్య చనిపోయింది. నా కొడుకుతో కలిసి గుడిసెలో జీవితం వెళ్లదీస్తున్నా" అని ఆవేదన వ్యక్తం చేశాడు.



# ప్రజాపాలన

**సంపాదకీయం**

**ఆదివారం 6, డిసెంబరు 2020**


# ఏ పార్టీ 'కీ' తీర్పు..?

**ఎన్.మల్లిఖార్జున్..**

దెబ్బమీద దెబ్బ, తగులుతుంది టీఆర్ఎస్కి, నల్లేరుమీద నడక అనుకున్న చోట ఆపసోపాలు పడక తప్పలేదు ఇదే తీరు భవిషత్ లో ఉంటుందా అంటే ఏమో చెప్పలేము కానీ ఇప్పటికైతే జనాలకు మొహం మొత్తినట్టుగా ఉంది, మార్పు కోరుకుంటున్నట్టుగా ఉన్నారు,అరవై ఏళ్ళ కల సాకారం చేసిన పార్టీని ఆరున్నర సంవత్సరాలకె చాలు పో అన్నారు అంటే తప్పు ఎక్కడ జరిగినట్టు ..? టీఆర్ఎస్ ఇచ్చిన నగర అభివృద్ధి నినాదం ఎందుకు పని చేయలేదు..? హైదరాబాద్ భవిషత్ ప్రణాళికలు ప్రజలను ఎందుకు ఆకట్టుకోలేదు ..? మాత తత్వ పార్టీలకు ఓటు వేస్తే నగరం అల్లకల్లోలం అవుతుంది నగరంలో పెట్టుబడులు పెట్టడానికి కంపినీలు రావు, మీ పిల్లలకు ఉద్యోగాలు రాకుండా పోతాయి అని చెప్పినా కూడా నగర ఓటరు ఎందుకు వినలేదు..?

అకాల వర్షాలు , ఆపద సాయం , ముందస్తు ఎన్నికలే కారు జోరును తగ్గించాయా,..? కమల వికాసానికి కారణం అయ్యాయా ? అంటే ఒక విదంగా అవుననే చెప్పాలి. ఐతే వీటికి మత ఎజెండా కూడా తోడైంది, ఐతే మెజార్టీ పోలరైజేషన్నే నమ్ముకొని బీజేపీ చేసిన రాజకీయాలు కూడా పూర్తి స్థాయిలో సక్సెస్ అయ్యాయా అంటే లేదనే చెప్పాలి. ఒకవేల హిందువులంతా బీజేపీని నమ్మి ఉంటే ఆ పార్టీకి కనీసం 106 సీట్లు రావాలి కానీ 48 సీట్లు మాత్రమే బీజేపీ సాదించింది, 55 సీట్లతో తెరాస సింగిల్ లార్జెస్ట్ పార్టీగా నిలిచింది. అంటే నగర ఓటర్ తీర్పులో మతం అనేది లేదు, ఐతే అదే సమయంలో మైనార్టీ పోలరైజేషన్లో ఎంఐఎం మాత్రం సక్సెస్ అయింది, 44 సీట్లు సాధించి అభివృద్ధితో మాకు పనిలేదు మాకు మతమే ముఖ్యం అని మరోసారి చాటిచెప్పింది.

పాత బస్తి లో ఎంఐఎం నేతలు చేసిన ప్రకటనలు పరిశీలిస్తే రాష్ట్రానికి కెసిఆర్ సీఎం ఏమో కానీ పాత బస్తీకి కాదు , పాత బస్తీలో కేటీఆర్ ప్రచారం చేయాలన్నా అసదుద్దీన్ పర్మిషన్ కావాలి , మేము తలుచుకుంటే రెండు రోజుల్లో ప్రభుత్వాన్ని మార్చగలం, తెరాస మేము పలికించే చిలుక, ఎంఐఎం రాజకీయాలలో కాకలు తీరిన పార్టీ, ట్యాంకుబండ్ లో ఉన్న ఎన్టీఆర్ , పీవీ స్మారకాలను కూల్చివేస్తాం అని అన్న మాటలకూ తెరాస ఎల్బీస్టేడియం లో ఏర్పాటు చేసిన సభలో కెసిఆర్ దీటైన సమాధానం చెప్తారు అని హైదరాబాదీలు ఆశించారు, కానీ వాటి ఊసే ఎత్తక పోగ ఎప్పుడు వాడి వేడిగా జరిగే సభ ఈ సారి చాలా చప్పగా జరగడం,మేనిఫెస్టోలో కొత్త అంశాలు ఏమి లేకపోవడం నగర ఓటర్ ని ఒకింత నిరాశకు గురిచేయడమే కాకుండా స్టీరింగ్ ఎంఐఎం చేతిలోనే ఉంది అన్న

సంకేతాలు ప్రజల్లోకి బలంగా వెళ్లాయి. ఇక్కడే బీజేపీ తన పదునైన వ్యూహాన్ని ప్రజలోకి తీసుకొని వెళ్ళింది అని చెప్పవచ్చు వరదసహాయం బీజేపీ వల్లే ఆగింది అని తెరాస చెప్పిన వెంటనే బీజేపీ పార్టీ అద్యేక్షుడు బండి సంజయ్ గారు,అది నిజం అయితే నిరూపించాలి అని చెప్పడం చార్మినార్ వద్దనున్న భాగ్యలక్ష్మి అమ్మవారి దగ్గర ప్రమాణం చేద్దాం రండి అని కెసిఆర్ కె సవాలు విసరడం, అన్నట్టుగానే బండి సంజయ్ చార్మినార్ వద్ద ఉన్న బాగ్యలక్ష్మ అమ్మవారిని దర్శించుకొని మీడియాతో మాట్లాడటంతో వరద సహాయం బీజేపీ వల్ల ఆగలేదు అన్న మెస్సేజ్ ప్రజలోకి బలంగా వెళ్ళింది.బీజేపీ జాతీయ పార్టీ అధ్యక్షుడు,యూపీ ముఖ్యమంతి , మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ప్రచారం లో పాలుగొనడం, కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా చార్మినార్ వద్ద ఉన్న భాగ్యలక్ష్మి అమ్మ వారిని దర్శించుకోవడం పార్టీ కార్యకర్తల్లో మరింత ఉత్సాహం నింపింది.

తెరాస కు ఓటు వేస్తే ఎంఐఎం కు వేసినట్టే అని చెప్పడం,ఎన్టీఆర్ ,పీవీ ల స్మారకాలు కూల్చుతే దారుసలాంను కూల్చుతాం,ఓల్డ్ సిటీ పై సర్జికల్ స్ట్రైక్స్ చేస్తాం అని పార్టీ అధ్యక్షుడు బండి సంజయ్ బాహాటంగా చెప్పడంతో బల్దియా ఎలెక్షన్స్ సినారియో పూర్తిగా మారిపోయింది.

తెరాస పార్టీ ఒక కుటుంబ పార్టీగా మారిపోయింది అన్న వాదన , దానికి తోడు ఉద్యోగాలు లేక నిరుద్యోగులు,పీఆర్సీల లేక ఉద్యోగస్తులు, ఈ కరోనా కష్టకాలంలో రిజిస్టేషన్ను ఆపి ఎల్లారెస్ తీసుకురావడంతో ఇటు రియల్టర్ అటు అవసరాలకు స్థిరాస్తులు అమ్మాలన్న,కొనాలన్నా వీలులేని నగరవాసులు ,సరిగా పనిచేయని ధరణి పోర్టల్,కరోనా కాలంలో ఉద్యోగాలు కోలుపోయిన ప్రవేట్ ఉద్యోగస్తులు, అకాల వర్షాలు, వరదలు, అగమ్య గోచరంగా మారిన వరదసహాయం వెర్రి కర్ణుని చావుకు వంద కారణాలు అన్నట్లు పార్టీ ఓటమికి మరెన్నో కారణాలు అని చెప్పవచ్చు ,పార్టీ పూర్తి స్థాయిలో సమాలోచనలు చేసి భవిషత్ కార్యాచరణాలు రూపొందిస్తే రాబోయే ఎన్నికల్లో ప్రజా ఆదరణ పొందవచ్చు లేదు అంటే అరవై ఎల్ల కళను సాకారం చేసిన పార్టీకి మరిన్ని కష్టాలు తప్పక పోవచ్చు.

# అకాడమీ విధానంతో అన్యాయం

కేంద్ర సాహిత్య అకాడమీ విధానం వల్ల ప్రముఖ రచయితలుగా పేరు పొందినవారు ఎందరో పురస్కారానికి అర్హత కోల్పోతున్నారు, కోల్పోయారు. సీనియర్లు, ఎన్నో పుస్తకాలు రాసినవారు, వయసు పైబడినవారు, జ్ఞానపీఠం, సరస్వతీ సమ్మాన్ అవార్డులకే అర్హులైనవారు ఎందరో ఉండగా పిన్న వయస్కులు, ఒకే ఒక పుస్తకం రాసినవారు పురస్కారం పొందటం అనుచితం, అక్రమం, అన్యాయం.సాహిత్యం పట్ల అభిరుచి, ఎంతో కొంత సృజనాత్మక కృషి ఉన్న సాహిత్యపరులకు కూడా, కేంద్ర సాహిత్య అకాడమీ పని తీరుతెన్నుల గురించి, ముఖ్యంగా ప్రతిఏటా ఇచ్చే పురస్కారాల పరిగణన, ఎంపిక గురించిన ప్రాథమిక విషయాలేవీ తెలియవు. స్వీయరచన, అనువాదం, యువరచయిత పురస్కారం, బాలసాహిత్యం.. ఇలా దేనిలోనైనా పురస్కారం పొందాలంటే ఆ పుస్తక ప్రచురణ జరిగి మూడేళ్ళకు మించకూడదు. అప్పుడే దానిని పరిగణనలోకి తీసుకుంటారు. ఉదాహరణకు, 2020కు గాను గత మూడు సంవత్సరాలలో ప్రచురితమైన పుస్తకాలు మాత్రమే అర్హమవుతాయి. అంటే 2017, 2018, 2019 సంవత్సరాలలో వచ్చిన పుస్తకాలనే పరిగణిస్తారు. 2016, ఇంకా అంతకు ముందు ప్రచురితమైతే వాటిని పరిగణించరు. అంతేకాక ఆ రచయిత అప్పటివరకూ చేసిన సాహిత్య కృషి లెక్కకు రాదు. దీనివల్ల ప్రముఖ రచయితలుగా పేరు పొందినవారు ఎందరో పురస్కారానికి అర్హతను కోల్పోతున్నారు, కోల్పోయారు. ఈ విషయమై యథాలాపంగా సద్యః స్ఫురణగా నాకు 40 మంది తెలుగు రచయితలపైనే గుర్తుకు వచ్చారు. ఆ పేర్లన్నీ రాస్తే ఈ రచన ద్వారా నేనుద్దేశించిన విషయం ఏమిటో చెప్పటానికి అవకాశం ఉండదు. అందువల్ల కొందరి ముఖ్యమైన పేర్లు మాత్రమే పేర్కొంటున్నాను. దాశరథి రంగాచార్య, వాసిరెడ్డి సీతాదేవి, రంగనాయకమ్మ, ముదిగంటి సుజాతారెడ్డి, ప్రోలాప్రగడ రాజ్యలక్ష్మి, ముక్తేవి భారతి, డి. కామేశ్వరి, సి. ఆనం దారామం వంటి రచయిత్రులు, పులిగడ్డ విశ్వనాథరావు, శీలావీర్రాజు, చాసో, భాస్కరభట్ల కృష్ణారావు, రంధి సోమరాజు, కాలువ మల్లయ్య, కల్లూరి భాస్కరం, పల్లేటి రఘోత్తమరెడ్డి, నందిని సిధారెడ్డి మొదలైన వారికి సృజనాత్మక లేదా అనువాద రచయితల పురస్కారం రాలేదు. ఇది దురదృష్టకరం, అన్యాయం, అక్రమం. కేంద్ర సాహిత్య అకాడమీ 1954 నుంచి పురస్కారాలు ఇస్తున్నది. ఇక పాతతరం వారిలో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, కరుణ కుమార, చింతాదీక్షితులు, కొ.కు వంటి వారికి రాలేదు. తిరుమల రామచంద్రకు మరణానంతరం వచ్చింది. ఆయన స్వీయచరిత్ర 'హంపీ నుంచి హరప్పా దాక' ఒక శతాబ్ది కాలంలోనే గొప్ప పుస్తకాల పరిగణనలో ఒకటిగా నిలుస్తుంది. అట్లాగే గడియారం రామకృష్ణ శర్మకు అకాడమీ పురస్కారం మరణానంతరం లభించింది. సామల సదాశివకు నా పట్టుదల వల్ల బతికుండగానే వచ్చింది. నేను ఐదు సంవత్సరాల పాటు కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు కన్వీనరుగా ఉన్నాను. భద్రిరాజు కృష్ణమూర్తి సుమారు 15 సంవత్సరాల పాటు కేంద్ర సాహిత్య అకాడమీలో వివిధ స్థాయిల్లో అధికారిక హోదాలో ఉన్నారు. వారిని ఒకసారి, 'నిజంగా సాహిత్య అకాడమీ పురస్కారాలు రావల్సిన వారికి ఎందుకు రావటం లేదు' అని అడిగాను. 'ఇప్పటి వరకూ పొందిన వారు అర్హులు కారా' అని ఆయన గడుసుగా ఎదురుప్రశ్న వేశారు? 'కావచ్చు కానీ, సీనియర్లు, ఎన్నో పుస్తకాలు రాసినవారు, వయసు పైబడినవారు ఉండగా, తక్కువ వయస్కులు, ఒకే ఒక పుస్తకం రాసినవారు పురస్కారం పొందటం అనుచితం, అక్రమం, అన్యాయం కాదా' అని అడిగాను. కోడూరి ప్రభాకరరెడ్డి, ఘండికోట బ్రహ్మాజీరావు, గుండు సుబ్రహ్మణ్య దీక్షితులు, దాశరథి రంగాచార్య, ఆవంత్స సోమసుందర్, కె.వి. రమణారెడ్డి వంటి వారు జ్ఞానపీఠం, సరస్వతీ సమ్మాన్ అవార్డులకే అర్హులు కదా? మరి వారికెందుకు సాహిత్య అకాడమీ పురస్కారం రాలేదు? గడచిన 15 సంవత్సరాల కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు కమిటీల సభ్యులెవరో వెల్లడి అయితే ఈ విషయం కుండ బద్దలు కొట్టకుండానే స్పష్టమవుతుంది. 1954 నుంచి అకాడమీ పురస్కారాలనిస్తున్నది. రచయితలు, కవులతో 'సాయం సంధ్యాగోష్ఠి', 'మీ అభిమాన రచయితతో ఒక సాయంత్రం' మొదలైన కార్యక్రమాలను కూడా అకాడమీ నిర్వహిస్తోంది. వాటిని సైతం నిర్వాహకులు వారి చిత్తానుసారం జరుపుతున్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలు, సత్కారాలు 66 సంవత్సరాలుగా రావాల్సిన సీనియర్ రచయితలకు బహు సకృతుగా మాత్రమే వచ్చాయి.

## బాబాసాహెబ్ అంబేడ్కర్

**(నేడు డా.బాబాసాహెబ్ అంబేడ్కర్ 64 వ వర్ధంతి సందర్భంగా)**

సిల్లకంపలు ఎక్కడికక్కడ అడ్డుపడి
చీత్కరించిన నేల
ఇప్పుడు...
గడ్డిపరకల పువ్వులై పరుచుకున్నాయి

ఒళ్ళంతా పచ్చి గాయాల అవమానాల
మోతై మోగుతుంటే
నువ్వే...ఇప్పుడు
సమతా మమతా కరుణై పువ్వుల
వర్షాలు కురుస్తున్నాయి..

రాళ్ళు , రప్పలు
కొండలు , గట్లు
చెట్లు, చెమలు
ఏర్లు , సెలయేర్లు
నీ పేరు పలికితే పరవశించి పోతాయి...

ఆకాశంలో సుక్కలు
భూమిపై పక్షులు
నీ పేరు వింటే ' భీం ' పద్యాలు పడతాయి

ఈ నేలపై పుట్టిన బిడ్డలకు
ఈ నేలపై బతికే హక్కు
నీ వలనే కదా కలిగింది...

బాబాసాహెబ్జి
నువ్వు నడిచిన నేల
నల్లరంగై నినాదమైంది
కాకుల పాటే నీలమై కదులుతుంది.

**తంగిరాల - సోని**
**96 766 09 234**

# ప్రజావ్యతిరేకతను చాటిచెప్పిన జిహెచ్ఎంసి ఎన్నికల ఫలితాలు !




మద్యం ఏరులైపారిన,సంచులకొలది డబ్బులు పంచిన,ఓటర్లను ఆకర్షించడానికి మేనిఫెస్టో ద్వారా ఎన్నిరకాల హామీలు ఇచ్చిన,ఎన్నికల సమయంలో వేయాల్సిన ఎత్తుగడలు ఎన్నివేసిన,ప్రజలను కొంత భయాందోళనలకు గురిచేసి ఓటింగ్ శాతాన్ని తగ్గించడంలో కొంతవిజయం సాధించిన, ఎలాగైనా ఓటర్లను తమ జిమ్మిక్కులతో మసిపూసి మారేడుకాయ చెయ్యొచ్చులే అనుకున్నా,ప్రజాతీర్పు ఎలా ఉంటుందో మరొకసారి ఓటరు మహాశయులు ఈఎన్నికలలో చాటిచెప్పారనడంలో ఎలాంటి అతిశయోక్తిలేదు.

ఇందులో కేవలం పాలకపక్షంపై వ్యతిరేకత ఏమేరలో కొనసాగుతుందో రుజువు చేశారని చెప్పవచ్చు.ఎంతపెద్ద పార్టీ అయినా,ఎలాంటి నాయకుడయినా ప్రజాతీర్పుకు తలవంచక తప్పనిపరిస్థితిని చాటిచెప్పిందని చెప్పకతప్పదు.ఇక్కడ భారతీయ జనతాపార్టీ 2016 ఎన్నికలలో నాలుగు సీట్లు సాధించగా, 2020 ఎన్నికలలో 48 సీట్లు సాధించిన, మొన్నజరిగిన దుబ్బాక శాసనసభ ఉపఎన్నికలలో రఘునందన్ విజయం సాధించిన కారణం... కేవలం ప్రజలు పాలకపక్ష పనితీరుపై వెల్లడిస్తున్న అసంతృప్తి అన్నది ముమ్మాటికి వాస్తవం.ఇక్కడ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల ఫలితాలలో ఒక ఆసక్తికరమైన విషయం నెలకొంది.పోలైన ఓట్లలో భారతీయ జనతా పార్టీ 12,13,900 ఓట్లను కలిగి,31.43 శాతంతో మొదటి స్థానంలో నిలవగా, తెలంగాణ రాష్ట్రసమితిపార్టీ 11,89,250 ఓట్లను పొంది 30.79 శాతంతో ద్వితీయ స్థానంలో నిలిచింది.అలాగే అధికారపార్టీ సాధించిన 55 సీట్లలో 27 సీట్లు హైదరాబాదులో శాశ్వతనివాసం ఏర్పరుచుకున్న ఆంధ్రప్రదేశ్ వాసులు కావడం గమనార్హం. అంటే ఈ ఎన్నికలలో అధికార పార్టీపై ఇంత వ్యతిరేకత రావడానికి వరదల ప్రభావంతో తీవ్ర ఇబ్బందులతో బాధపడుతున్న తరుణంలో సహాయకచర్యలు చేపట్టడంలో సర్కారు నిర్లక్ష్యం వహించడం,రెండు పడకగదుల ఇళ్ల నిర్మాణం,మురికి కాలువల పునరుద్ధరణ, రహదారుల మరమ్మతు,సిట్టింగ్ కార్పొరేటర్లపై ఉన్న అవినీతిఆరోపణలు మరొక కారణమయ్యాయని చెప్పవచ్చు.

అధికారంలో కొనసాగుతున్న ఎమ్మెల్యేలు మంత్రులకు ఇవ్వాల్సిన అధికార బదలాయింపులు ఇవ్వకుండా ఒకరిద్దరి చేతుల్లోనే నిర్ణయాధికారం ఉండటం అనేది ప్రజలు గమనిస్తూవస్తూ ఉన్నారు.మేము ఏమిచెప్పినా అదే శిరోధార్యం అనే నియంతృత్వ పోకడకు ఈఫలితాలే నిదర్శనం అని చెప్పకతప్పదు.

యావత్ తెలంగాణ ప్రజానీకం ఏకమై మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొని,ఎన్నోఆశలతో ప్రత్యేకరాష్ట్రాన్ని ఏర్పర్చుకొని ఎదురుచూడగా గత ఆరున్నర సంవత్సరాల పరిపాలనకాలంలో ఆశించిన అభివృద్ధి జరగలేదన్నది వాస్తవం.ప్రత్యేకంగా ఉద్యమంలో కీలకపాత్ర పోషించినది కేవలం విద్యార్థులు,నిరుద్యోగులు కానీ వారు బ్రతుకులు ఎండమావిలా తయారయ్యాయి.ఉద్యమపార్టీగా పేరుగాంచిన తెలంగాణ రాష్ట్ర సమితిపార్టీ నీళ్లు,నిధులు, నియామకాలు అనేనినాదంతో అధికారం చేపట్టాక ఎలాంటి కొలువులు చేపట్టకపోగా నిరుద్యోగితను పెంచిపోషించిందని చెప్పవచ్చు.అలాగే ఉద్యోగులపాలిట గుదిబండగా మారింది.తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసినవారిని దూరంగాపెడుతూ ఆనాడు ద్వేషించిన ఇతరపార్టీ నాయకులను తమపార్టీలో చేర్చుకుని పదవులు ఇచ్చి,రాష్ట్రంలో ప్రతిపక్షమే లేకుండాచేసి,తన కుటుంబంలోనే పలువురికి రాజకీయ పదవులు అప్పగించి పాలనకొనసాగించిన... తెలంగాణ ప్రజలు మరొకసారి ఆశీర్వదించి పాలకపగ్గాలు అప్పగించారు.కానీ నిరుద్యోగుల మరియు ఉద్యోగుల విషయంలో ఎలాంటి మేలు చేకూర్చకపోవడం,విద్యావ్యవస్థను సరైనరీతిలో పట్టించుకోక పోవడం,ఎన్నికల సమయాలలో ఇచ్చిన హామీలను నెరవేర్చక పోవడంతో ప్రజల్లో వ్యతిరేకత మొదలై ప్రత్యామ్నాయ పార్టీకోసం ఎదురుచూస్తున్న తరుణంలో భారతీయ జనతాపార్టీ ఆశాజనకంగా కనిపించి ప్రజలు ఆదరించడం మొదలుపెట్టారని చెప్పవచ్చు.

అందులో భాగంగానే ఈఒక్క సంవత్సరంలోనే జరిగిన ఎన్నికలలో పార్టీ పుంజుకుంటున్న తీరు నిదర్శనం.ప్రజలలో కొనసాగుతున్న అసంతృప్తిని చూస్తుంటే త్వరలో జరగబోయే వరంగల్ మరియు ఖమ్మం మున్సిపాలిటీ ఎన్నికలు, నాగార్జునసాగర్ శాసనసభ ఉపఎన్నిక మరియు 2 గ్రాడ్యుయేట్ శాసనమండలి ఎన్నికలలో ఎలాంటి ఫలితాలు వస్తాయో అంచనా వేయవచ్చు.

ఇప్పటికైనా ఈప్రభుత్వంలో నిరుద్యోగుల అవస్థల గురించి శాస్త్రీయమైన విశ్లేషణ గావించాల్సిన అవసరం ఎంతైనాఉన్నది. కరోనా నేపథ్యంలో ప్రైవేటు ఉపాధ్యాయుల బతుకులు బజారున పడి, దుఃఖసాగరంలో మునిగి పోయాయి. వారిగురించి ఆలోచించి శాశ్వత పరిష్కారం సూచించాల్సినవసరం కూడా ఉన్నది.అలాగే ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన చట్టాలు, పథకాల గురించి పునరాలోచించి, ప్రజలకు ఏవిధంగా ఉపయోగపడుతున్నాయో సరిచూసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనాఉన్నది. అంతకంటే ముందు జిహెచ్ఎంసి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన హామీలను తూ.చా తప్పకుండా నెరవేరుస్తూ ముందుకెళ్లాలి. లేనిచో వచ్చేఎన్నికల్లో ఇలాంటి ఫలితాలను రుచిచూడటమే కాకుండా రాబోయే 2023 రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన ఆశ్చర్య పడనక్కరలేదు.

ప్రజలు ప్రతివిషయాన్ని గమనిస్తూ, అవసరం వచ్చినప్పుడు ఎలాంటి తీర్పునిస్తారో గతంలో ఎన్నోసార్లు రుజువుకాగా, మరొకసారి పునరావృతం అయ్యిందని చెప్పవచ్చు.అందుకే రాష్ట్రంలో ప్రజానుకూల పనులను చేపడుతూ,పలుసమస్యల పరిష్కార మార్గాలను కనిపెడుతూ, నిస్వార్థంగా, నిష్పక్షపాతంగా అమలుపరుస్తూ అభివృద్ధివైపు అడుగులు వేయాల్సిన తరుణం ఆసన్నమయ్యింది. ఇప్పటికైనా అధికార ప్రభుత్వం తమ ఫలితాలను విశ్లేషించుకుని, ప్రతివక్షానికి విలువనిస్తూ, ప్రశ్నించేతత్వాన్ని గౌరవిస్తూ, కుటుంబ పాలనకు స్వస్తి పలుకుతూ ముందడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.లేనిచో భవిష్యత్తులో తీవ్ర గడ్డు పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుంది.

భారతీయ జనతాపార్టీ సైతం పుంజుకుంటున్న తీరునుచూసి సంబర పడిపోకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి పూనుకోవాలి. ఎందుకంటే ప్రజలు ఆదరిస్తున్నారు అంటే కారణం..వారిపైనున్న ప్రేమకంటే రాష్ట్రంలో అధికారపార్టీపైన ఉన్న వ్యతిరేకతన్న విషయాన్ని మరవకుండా ముందుకువెళుతూ,ప్రజల పక్షాననిలుస్తూ, వారి ఆదరాభిమానాలను శాశ్వతంగా పొందటానికి కృషిచేయాలి.అప్పుడే వారనుకున్న లక్ష్యాలు నెరవేరతాయి. ఏదిఏమైనా ఇప్పటినుంచైనా తెలంగాణలో అభివృద్ధి కార్యక్రమాలు జరిగి, అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశిద్దాం.

**డా.పోలం సైదులు**
**ముదిరాజ్,**
**9441930361.**

## ఆసిఫాబాద్ ఆకాశం అవులు సమాజానికి ఆదర్శం

### సాహితీ పోషకులు నాంపల్లి శంకర్



**ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి (పాలపాలన):** ఆకాశం కవులు సమాజానికి ఆదర్శం కావాలని సాహితీ పోషకులు నాంపల్లి శంకర్ అన్నారు. ఆసిఫాబాద్ కవుల సంఘం దశమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలోని సాయి బాబా ఆలయం ఆవరణ లో ఉత్తమ కవులను సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాహితీ కార్యక్రమాన్ని విస్తృత పరిస్థితి తన వంతు సహకారాన్ని అందిస్తామని అన్నారు. అనంతరం కవిగా రాష్ట్ర జాతీయ స్థాయిలో పలు అవార్డులు అందుకున్న డాక్టర్ వనపర్తి తిరుపతి ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆకాశం కవుల సంఘం గౌరవ అధ్యక్షులు మడుగుల నారాయణ మూర్తి, అధ్యక్షులు గుర్రాల వెంకటేశ్వర్లు, వ్యవస్థాపక కార్యదర్శి నల్లగొండ రమేష్, సాహితీ ప్రముఖులు ధర్మపురి వెంకటేశ్వర్లు, లక్ష్మీకాంత్ ఆచార్య, ఢిల్లీ విజయ్ కుమార్, కోటేశ్వర్ రావు, శ్రీరామ్ సత్యనారాయణ, కిల్లి వెంకట్రావు, సాయిని రాజశేఖర్, కోటేశ్వరరావు, శ్రావ్య, కవులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం

**వలిగొండ, ప్రజాపాలన :** మండలంలోని లోతుకుంట గ్రామంలో గల ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో,6 వ తరగతిలో చేరే విద్యార్థులు ఈ నెల 12 వ తేదీ వరకు పాఠశాలలో అడ్మిషన్లు పొంద వచ్చని పాఠశాల ప్రిన్సిపాల్ రాము శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

## విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



**వలిగొండ, ప్రజాపాలన :** ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో ఈ నెల 8 న ఏర్పాటు చేయనున్న మాజీ శాసన సభ్యులు గుర్రం యాదగిరి రెడ్డి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి యాణాల దామోదర్ రెడ్డి అన్నారు.శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడుతూ యాదగిరిరెడ్డి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి మన మండలం నుండి కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో బోడ సుదర్శన్,పోలేపాక యాదయ్య,ఎలగందుల అంజయ్య,సల్వాద్రి రవీందర్,మహేష్,అంజయ్య,నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వంగాల 10వ వర్ధంతి వేడుకలు



**వలిగొండ, ప్రజాపాలన :** మండలంలోని నేమిలేకాల్వ గ్రామానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకులు స్వర్గీయ వంగాల బాలనర్సయ్య 10 వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి వారి కుటుబ సభ్యులు వంగాల వెంకన్న గౌడ్,వంగాల వాసు గౌడ్, వంగాల రోహిత్ గౌడ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం మండలంలోని టేకులసోమ రం గ్రామంలో గల సాధన మానసిక వికలాంగుల ఆశ్రమంలో అన్నదానం చేసి వారికి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్ర్యక్రమంలో టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పైళ్ళ రాజవర్ధన్ రెడ్డి మండల పార్టీ అధ్యక్షుడు డేగల పాండు యాదవ్ మార్కెట్ కమిటీ చైర్మన్ కూనపురి కవిత,రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ మమత నరేందర్ రెడ్డి,మాజీ జెడ్పిటిసీ మొగుళ్ళ శ్రీనివాస్, వలిగొండ పిఏసీఎస్ చైర్మన్ సురకంటి వెంకట్ రెడ్డి, సర్పంచులు గూడూరు శివశాంత్ రెడ్డి,వంగాల బిక్షపతి,మద్దెల సందీప్ నాయకులు కెసిరెడ్డి జనార్ధన్ రెడ్డి,పబ్బు ఉపేందర్ బోస్,చెరుకు శివయ్య,మాద శంకర్,ముద్దసాని కిరణ్ రెడ్డి,పలుసం రమేష్,అయిటిపాముల ప్రభాకర్,సత్యనారాయణ,కొండూరు వెంకటేశం,శేఖర్,సలీం,మద్దెల దనంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## టిఆర్ఎస్ నాయకులు రాములుకు ఘన నివాళి



**వలిగొండ ప్రజా పాలన :** మండలంలోని వర్కట్ పల్లి గ్రామానికి చెందిన టిఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గుర్రం రాములు అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందడంతో శనివారం టిఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో రాములు మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల పార్టీ అధ్యక్షుడు డేగల పాండు యాదవ్,మాజీ జడ్పీటిసి మొగుళ్ల శ్రీనివాస్,సర్పంచ్ మీసాల శేఖర్,గ్రామశాఖ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి,బాల నర్సింహా,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# మానవజాతికి భూమాత ప్రకృతి సంపద

### మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్ల పల్లి మంజుల రమేష్



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 5 (ప్రజా పాలన) :** మానవ జాతికి భూమాత ప్రకృతి సంపద అని మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్ళ పల్లి మంజుల రమేష్ కొనియాడారు. శనివారం మున్సిపల్ పరిధి లోని రామయ్య గూడకు చెందిన 18వ వార్డు కౌన్సిలర్ కొండేటి కృష్ణ, 19వ వార్డు కౌన్సిలర్ రాయికల్ నర్సింలు ముదిరాజ్ కార్యంలో ప్రపంచ నేల దినోత్సవాన్ని పురస్కరించుకొని వార్డు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ నేల మానవునికి ప్రకృతి సిద్ధంగా లభించిన సంపదల్లో ఒకటని గుర్తుచేశారు. వ్యవసాయ ప్రధానమైన మనదేశం వంటి దేశాలకు నేలతల్లితో సరిసమానం అంటే అతిశయోక్తి కాదని అన్నారు. పంటలు పండటానికి అవసరం అయ్యే తేమను పోషకాలను సూక్ష్మ జీవులను కూడా భూమి తనలో ఇముడ్చుకొని మొక్కలకు అవసరమయ్యే లవణాలను అందజేస్తుందని పేర్కొన్నారు. ఆహార సాధనకే కాక జాతి సౌభాగ్యం దేశ ఆర్థిక స్థితికి తోడ్పడే భూమాతను పరిరక్షించుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. నేలలో భౌతికంగా బంకమన్ను ఒండ్రు ఇసుకరేణువుల తోపాటు సేంద్రియ పదార్థం గాలి నీరు సూక్ష్మజీవులు క్రిమికీటకాలు వానపాములు ఇతరత్రా పురుగులు ఉంటాయన్నారు. రసాయనికంగా ఉండే లవణాలు పరిమాణం ఉదజని సూచిక పోషకాల లభ్యత సూక్ష్మజీవుల ఇవన్నీ మొక్కల పెరుగుదలతో ఉత్పాదక శక్తి పై ప్రభావం చూపిస్తాయి అన్నారు. ఆహారాన్ని పెంచుటకు ప్లాస్టిక్కు నివారిద్దాం పిలుపు ఇచ్చారు. అనంతరం రామయ్య గూడలో తన ఇంటి ఆవరణలో మంచి మంచి మొక్కలు పెంచుతున్న ఓ మహిళను శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యోగీ శ్వరులు, కౌన్సలర్లు సురేష్, నవీన్, చందర్ నాయక్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్ కుమార్, టీఆర్ఎస్ నేత రమణ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# బంగారం..గరం..గరం


**ముంబై, డిసెంబర్ 5, (ప్రజాపాలన) :** బంగారం ధర జిగేల్ మంటోంది. పసిడి ధర పరుగులు పెడుతూనే వస్తోంది. మెరిసిపోతోంది. బంగారం ధర ఈరోజు కూడా పైపైకి కదిలింది. బంగారం కొనుగోలు చేయాలని భావించే వారికి ఇది బ్యాడ్ న్యూస్ అని చెప్పొచ్చు. బంగారం ధర పెరిగితే వెండి ధర కూడా ఇదే దారిలో నడిచింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధర పెరుగుదల నేపథ్యంలో దేశీ మార్కెట్‌లోనూ ధరలు పెరిగాయని బులియన్ మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. హైదరాబాద్ మార్కెట్‌లో శనివారం బంగారం ధర పెరిగింది. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.220 పైకి కదిలింది. రూ.50,290 చేరింది. అదేసమయంలో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర కూడా ఇదే దారిలో నడిచింది. రూ.200 పెరుగుదలతో రూ.46,100కు ఎగసింది. బంగారం ధర పెరిగితే.. వెండి ధర కూడా ఇదే దారిలో నడిచింది. రూ.200 పెరిగింది. దీంతో వెండి ధర రూ.67,500కు చేరింది. పరిశ్రమ యూనిట్లు, నాణేపు తయారీదారుల నుంచి డిమాండ్ పుంజుకోవడం ఇందుకు ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు.మరోవైపు అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా బంగారం ధర జిగేల్ మంది. బంగారం ధర ఔన్స్‌కు 0.05 శాతం పెరుగుదలతో 1842 డాలర్లకు చేరింది. బంగారం ధర పెరిగితే వెండి ధర కూడా ఇదే దారిలో పయనించింది. వెండి ధర ఔన్స్‌కు 0.74 శాతం పెరుగుదలతో 24.31 డాలర్లకు చేరింది.ఇకపోతే బంగారం ధరపై ప్రభావం చూపే అంశాలు చాలానే ఉన్నాయి. ద్రవ్యోల్బణం, గ్లోబల్ మార్కెట్ పసిడి ధరల్లో మార్పు, కేంద్ర బ్యాంకుల వద్ద ఉన్న బంగారం నిల్వలు, వడ్డీ రేట్లు, జువెలరీ మార్కెట్, భౌగోళిక ఉద్రిక్తతలు, వాణిజ్య యుద్ధాలు వంటి పలు అంశాలు పసిడి ధరపై ప్రభావం చూపుతాయి.

# కోటలో కొనసాగుతున్న పట్టు

**హైదరాబాద్, డిసెంబర్ 5, (ప్రజాపాలన) :** మజ్లిస్ పార్టీ హైదరాబాద్ లోనే పుట్టిన పార్టీ. ప్రత్యేకంగా పాతబస్తీ కేంద్రంగా ఎదిగిన పార్టీ. అలాంటి ఎంఐఎం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో కీలక భూమిక పోషిస్తుందని తొలి నుంచి ఊహించిందే. అలాగే ఎన్నికల ఫలితాలను చూస్తుంటే అదే రుజువవుతుంది. తమ గ్రిప్ నగరంలో ఏమాత్రం తగ్గలేదని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ మరోసారి నిరూపించారు. మొత్తం 52 స్థానాల్లో పోటీ చేసిన ఎంఐఎం దాదాపు 45 స్థానాలకు పైగానే ఆధిక్యంలో ఉండటం విశేషం. గత ఎన్నికల్లో ఎంఐఎం 44 స్థానాల్లో గెలిచింది. హైదరాబాద్ పాతబస్తీ అంటే అదో ప్రత్యేక సామ్రాజ్యం. వేరే ఎవరూ, ఎంతటి పెద్ద వారైనా ఆ కోట లోకి ప్రవేశించటం అసంభవం అంటారు. మరోసారి అది రుజువయింది. పాతబస్తీలోని అన్ని సీట్లను ఎంఐఎం దాదాపుగా కైవసం చేసుకుంది.

ఈ మున్సిపల్ ఎన్నికల్లో తమకు, టీఆర్ఎస్ కు పొత్తు లేదని బహిరంగంగా చెప్పింది. అక్బరుద్దీన్ వంటి నేతలు సయితం టీఆర్ఎస్ పై విరుచుకు పడ్డారు. ఎంఐఎం ఎమ్మెల్యేలయితే రెండు నెలల్లో టీఆర్ఎస్ సర్కార్ ను కూల్చి వేస్తామని చెప్పారు. తాము పోటీ చేసిన 52 స్థానాల్లోనూ ఎంఐఎం తరుపున అన్నదమ్ములిద్దరూ మాత్రమే ప్రచారం చేశారు. అసదుద్దీన్, అక్బరుద్దీన్ లు ఈసారి ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఈ ఎన్నికల్లో ప్రచారం చేశారు. ఇతర రాష్ట్రాలైన బీహార్, మహారాష్ట్రల్లో ఎంఐఎం గెలుస్తున్నప్పుడు సొంత నగరంలో పట్టుకోల్పోకూడదన్న లక్ష్యంతో ఎంఐఎం పనిచేసిందనే చెప్పాలి. టీఆర్ఎస్ అభ్యర్థులపై నామమాత్రంగా అభ్యర్థులను ఎంఐఎం నిలబెట్టగా, టీఆర్ఎస్ కూడా ఎంఐఎం మీద డమ్మీ అభ్యర్థులను నిలబెట్టిందన్న ప్రచారం కూడా ఉంది. అవన్నీ పక్కన పెడితే విజయం మాత్రమే ముఖ్యం. తమకు పట్టున్న అన్ని ప్రాంతాల్లోనూ ఎంఐఎం విజయకేతనం ఎగుర వేసింది. తమకు మరే పార్టీ తమ ప్రాంతంలో సరిపోదని తేల్చి చెప్పింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ను శాసించే స్థాయిలో ఎంఐఎం ఉందని చెప్పక తప్పదు. ఏది ఏమైనా అనధికారికంగా టీఆర్ఎస్ కు ఎంఐఎం మద్దతిచ్చినా అత్యధిక స్థానాల్లో నిలిచి అసద్ మరోసారి నగరంలో తన గ్రిప్ ను నిలబెట్టుకోగలిగారు.

# మమతా.. చిక్కులు..



**బెంగాల్, డిసెంబర్ 5, (ప్రజాపాలన) :** మమత బెనర్జీ పాలనపై మోహం మొత్తిందా? ఆమె నాయకత్వంపై విశ్వాసం సన్నగిల్లిందా? అంటే బెంగాల్ రాజకీయాలను ఒకసారి చూస్తే అవుననే అనిపిస్తుంది. ఎన్నికల సమయంలో ఒక్కొక్కరు పార్టీని వీడిపోతుండటం ఈ ప్రశ్నలకు మరింత ఊతమిచ్చింది. మమత బెనర్జీ పదేళ్లుగా ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఒంటిచేత్తో పార్టీని, ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారు. మమత బెనర్జీ చరిష్మా వల్లనే తృణమూల్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నది కాదనలేని వాస్తవం. దశాబ్దాలుగా వామపక్షాల కంచుకోటను బద్దలు కొట్టి మరీ మమత బెనర్జీ అధికారంలోకి వచ్చారంటే అది ఆమె చలవే. ఆమె చేసిన ప్రసంగాలు, ప్రజలను ఆకట్టుకున్న తీరు అధికారాన్ని కట్టబెట్టాయి. అయితే రెండు సార్లు సులువుగా అధికారంలోకి వచ్చిన మమత బెనర్జీ మూడోసారి మాత్రం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా భారతీయ జనతా పార్టీ ఇక్కడ స్ట్రాంగ్ అవుతుండటం మమత బెనర్జీని ఆందోళన కల్గిస్తుంది. బీజేపీని కట్టడి చేసే పనిలో ఉన్న మమత బెనర్జీకి వరసగా ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. అండగా ఉండాల్సిన సమయంలో మమత బెనర్జీని వీడి నేతలు వెళ్లిపోతున్నారు. ప్రధానంగా మంత్రివర్గంలో ఉన్న వారే పార్టీని వీడి వెళుతుండటం ఆందోళన కల్గించే విషయమే. ఇటీవల పశ్చిమ బెంగాల్ రవాణా శాఖ మంత్? సువేందు అధికారి పార్టీని వీడి వెళ్లిపోయారు. మంత్రిపదవికి కూడా రాజీనామా చేశారు. సువేందు అధికారి పార్టీలో సీనియర్ నేత కావడం విశేషం. టీఎంసీ ఎమ్మెల్యే గోస్వామి కూడా పార్టీని వీడారు. ఈయన కూడా టీఎంసీ ఆవిర్భావం నుంచి ఉన్నవారే. ఈయనతో పాటు మరికొందరు పార్టీని వీడతారన్న ప్రచారం జరుగుతోంది. వీరిలో సీనియర్ నేతలు కూడా ఉండటం విశేషం. మమత బెనర్జీని ఎన్నికలకు ముందు మానసికంగా దెబ్బతీసేందుకు బీజేపీ ఆపరేషన్ ఆకర్ష్ ను పశ్చిమ బెంగాల్ లో ప్రారంభించింది. సీనియర్ నేతలే వెళుతుండటంతో పార్టీ క్యాడర్ ధైర్యాన్ని కూడా దెబ్బతినే అవకాశముంది. దీంతో మమత బెనర్జీకి రానున్న కాలంలో పార్టీ నుంచి మరిన్ని తలనొప్పులు రాకతప్పట్లు లేవు. మరి ఈ చిక్కుల నుంచి దీదీ ఎలా బయటపడతారో చూడాలి.

## కరోనాతో మారిన లైఫ్ స్టైల్

**రంగారెడ్డి, డిసెంబర్ 5, (ప్రజాపాలన) :** వారికి పట్నంలో పనిలేదు.. మనీ లేదు. ఉన్నపణంగా ఉపాధి పోయింది. ఉన్నట్టుండి రోడ్డున పడ్డారు. కుటుంబ పోషణ గగనమైంది. కరోనా కాటుకు వలసకూలీలు విలవిలలాడారు. కట్టుబట్టలతో, ఖాళీకడుపులతో ఊరిబాటపట్టారు. హైదరాబాద్ నగరంలో విపత్కర పరిస్థితులను తట్టుకోలేక సొంతూళ్లకు వచ్చిన చాలా మంది స్థానికుల అండతో కొత్త ఉపాధిని వెతుక్కుని జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం వైరస్ ప్రభావం తగ్గినా పట్టణాలకు తరలిపోకుండా సొంత గ్రామం లేదా జిల్లాలో స్థిర నివాసం ఏర్పరచుకొని తోచిన వ్యాపారం చేస్తూ, కూలిపని చేసుకుంటూ కుటుంబాలను సాకుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో విద్యావంతులైన నిరుద్యోగులు పలువురు సొంతంగా చిరు వ్యాపారాలు ఏర్పాటు చేసుకోగా ఇతరులు పలు షాపుల్లో పనులకు వెళ్తూ పొట్టపోసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఎక్కడి నుంచైనా ఏ రేషన్ దుకాణం నుంచైనా రేషన్ సరుకులు తీసుకునే(పోర్టబిలిటీ) వెసులుబాటును రాష్ట్ర ప్రభుత్వం కలిపించని విషయం తెలిసిందే. కరోనాకు ముందు ప్రస్తుతం పోర్టబిలిటీ సేల్‌ను పరిశీలిస్తే అధిక మొత్తంలో ప్రజలు సొంతూళ్లలోనే ఉపాధి పొందుతూ జీవనం సాగిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో మార్చి 22న జనతా కర్ఫ్యూ, వెంటనే లాక్‌డౌన్ అమల్లోకి రాగా ఆ తర్వాత విడ తలవారీగా అన్‌లాక్ చేశారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో, ఇతర ప్రాంతాల్లో ప్రైవేట్‌లో ఉద్యోగాలు చేస్తున్న వందలాది మంది ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు. లాక్‌డౌన్‌తో పనుల్లేక వలస కూలీలు సొంత జిల్లాలకు తరలివచ్చారు. ప్రస్తుతం కరోనా ప్రభావం తగ్గుముఖం పట్టినప్పటికీ స్థానికంగానే ఉపాధి పొందుతున్నారు. మెదక్ జిల్లాలో కరోనాకు ముందు ఫిబ్రవరిలో రేషన్ పోర్టబిలిటీ కింద 18,825 మంది ఇతర ప్రాంతాల లబ్ధిదారులు రేషన్‌సరుకులు తీసుకున్నారు. ప్రస్తుతంఈ సంఖ్య 30,096కు చేరింది. ఇదే పరిస్థితి రాష్ట్రంలోని అనేక జిల్లాల్లోనూ గమనించవచ్చు.

## సోదిలో లేకుండాపోయిన కాంగ్రెస్

**హైదరాబాద్, డిసెంబర్ 5, (ప్రజాపాలన) :** అనుకున్నట్లే.. కాంగ్రెస్ తెలంగాణలో క్రమంగా కనుమరుగువుతోంది. జాతీయ పార్టీ, తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ ఏ ఎన్నికల్లోనూ తన పెరఫార్మెన్స్ ను చూపలేకపోతుంది. వరస ఓటములను చవిచూస్తున్నా పనితీరును మెరుగుపర్చుకోలేక చతికలపడుతూనే వస్తుంది. ఇటీవల జరిగిన దుబ్బాక ఉప ఎన్నిక ఫలితమే దీనికి ఉదాహరణ. అక్కడ కాంగ్రెస్ మూడో స్థానానికి పడిపోయింది. ఇక గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలను చూసుకుంటే వరస ఓటములు చవిచూస్తున్నా నేతల్లో మార్పు రాలేదు. టిక్కెట్ల కేటాయింపునకు ముందే అలక పాన్పు ఎక్కారు. ముఖేష్ గౌడ్ కుమారుడు విక్రమ్ గౌడ్ పార్టీని వీడి వెళ్లారు. అంజనీకుమార్ యాదవ్ వంటి వారు పార్టీ నాయకత్వంపై మండిపడ్డారు. ఇక టిక్కెట్ల కోసం కూడా అభ్యర్థులు పెద్దగా పోటీ పడలేదంటే ఆ పార్టీ పరిస్థితిని చెప్పకనే చెప్పవచ్చు. చివరి నిమిషం వరకూ బీఫాం ఇవ్వలేదు. ఇప్పుడు గ్రేటర్ మున్సిపల్ ఎన్నికల ఫలితాలను చూస్తుంటే కాంగ్రెస్ అసలు ఉందా? అన్న సందేహం తలెత్తుంది. గెలిచిన రెండు, మూడు చోట్ల అక్కడి అభ్యర్థుల ఇమేజ్ తోనే గెలిచారు తప్పించి, కాంగ్రెస్ పార్టీని చూసి కాదన్నది అందరికీ తెలిసిందే. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో తొలి నుంచి టీఆర్ఎస్ వర్సెస్ బీజేపీ అన్నట్లు గానే పోరు సాగింది. ప్రచారంలోనూ కాంగ్రెస్ ఎక్కడా కనపడకపోవడం విశేషం. నాడు గ్రేటర్ ఎన్నికల్లో విజయం సాధించి మేయర్ పీఠాన్ని కైవసం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విభజన తర్వాత నామరూపాల్లేకుండా పోయిందనే చెప్పాలి. నాయకత్వ లోపం, పార్టీపై నమ్మకం లేకపోవడం వంటి కారణా లతో గ్రేటర్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ సోదిలో లేకుండా పోయింది. దీంతో ఇక నగరంలో నిన్న మొన్నటి వరకూ బలంగా ఉన్న ఆ పార్టీ ఓటు బ్యాంకును బీజేపీ ఎగరేసుకుపోయినట్లే చెప్పుకోవాల్సి ఉంటుంది. మొత్తం మీద కాంగ్రెస్ పార్టీకి నగరంలో కోలుకోలేని దెబ్బ తగిలిందనే చెప్పాలి.

## సోదిలో లేకుండాపోయిన కాంగ్రెస్

**హైదరాబాద్, డిసెంబర్ 5, (ప్రజాపాలన) :** అనుకున్నట్లే.. కాంగ్రెస్ తెలంగాణలో క్రమంగా కనుమరుగువుతోంది. జాతీయ పార్టీ, తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ ఏ ఎన్నికల్లోనూ తన పెరఫార్మెన్స్ ను చూపలేకపోతుంది. వరస ఓటములను చవిచూస్తున్నా పనితీరును మెరుగుపర్చుకోలేక చతికలపడుతూనే వస్తుంది. ఇటీవల జరిగిన దుబ్బాక ఉప ఎన్నిక ఫలితమే దీనికి ఉదాహరణ. అక్కడ కాంగ్రెస్ మూడో స్థానానికి పడిపోయింది. ఇక గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలను చూసుకుంటే వరస ఓటములు చవిచూస్తున్నా నేతల్లో మార్పు రాలేదు. టిక్కెట్ల కేటాయింపునకు ముందే అలక పాన్పు ఎక్కారు. ముఖేష్ గౌడ్ కుమారుడు విక్రమ్ గౌడ్ పార్టీని వీడి వెళ్లారు. అం జనీకుమార్ యాదవ్ వంటి వారు పార్టీ నాయకత్వంపై మండిపడ్డారు. ఇక టిక్కెట్ల కోసం కూడా అభ్యర్థులు పెద్దగా పోటీ పడలేదంటే ఆ పార్టీ పరిస్థితిని చెప్పకనే చెప్పవచ్చు. చివరి నిమిషం వరకూ బీఫాం ఇవ్వలేదు. ఇప్పుడు గ్రేటర్ మున్సిపల్ ఎన్నికల ఫలితాలను చూస్తుంటే కాంగ్రెస్ అసలు ఉందా? అన్న సందేహం తలెత్తుంది. గెలిచిన రెండు, మూడు చోట్ల అక్కడి అభ్యర్థుల ఇమేజ్ తోనే గెలిచారు తప్పించి, కాంగ్రెస్ పార్టీని చూసి కాదన్నది అందరికీ తెలిసిందే. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో తొలి నుంచి టీఆర్ఎస్ వర్సెస్ బీజేపీ అన్నట్లు గానే పోరు సాగింది. ప్రచారంలోనూ కాంగ్రెస్ ఎక్కడా కనపడకపోవడం విశేషం. నాడు గ్రేటర్ ఎన్నికల్లో విజయం సాధించి మేయర్ పీఠాన్ని కైవసం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విభజన తర్వాత నామరూపాల్లేకుండా పోయిందనే చెప్పాలి. నాయకత్వ లోపం, పార్టీపై నమ్మకం లేకపోవడం వంటి కారణాలతో గ్రేటర్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ సోదిలో లేకుండా పోయింది. దీంతో ఇక నగరంలో నిన్న మొన్నటి వరకూ బలంగా ఉన్న ఆ పార్టీ ఓటు బ్యాంకును బీజేపీ ఎగరేసుకుపోయినట్లే చెప్పుకోవాల్సి ఉంటుంది. మొత్తం మీద కాంగ్రెస్ పార్టీకి నగరంలో కోలుకోలేని దెబ్బ తగిలిందనే చెప్పాలి.

## ఢిల్లీలో కొనసాగుతున్న రైతు ఉద్యమానికి మేడిపల్లి మండల రైతుల మద్దతు



**మేడిపల్లి, డిసెంబర్ 05 (ప్రజాపాలన):** మేడిపల్లి మండల కేంద్రంలో ఎక్స్ ఎంపీ పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఢిల్లీలో కొనసాగుతున్న రైతుఉద్యమానికి మద్దతుగా శనివారం మండల కేంద్రంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. తదనంతరం తాసీల్దార్ కు వినతిపత్రం ఇచ్చి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బొమ్మేన ప్రశాంత్, శ్రీపతి దామోదర్, దాసరి శంకర్, సంజీవ్ ఇంకా మండల నాయకులు పాల్గొన్నారు.

## ఎంపీ నామ చొరవతో సీఎం సహాయ నిధి నుండి చికిత్స కోసం రూ.150000 ఎల్ఓసీ మంజూరు



**మధిర, డిసెంబర్ 5, ప్రజాపాలన :** మధిర మండల పరిధిలోని సిరిపురం గ్రామానికి చెందిన తేళ్ళూరి వెంకటేశ్వర్లు రెండు మోకాళ్ళు నొప్పితో తీవ్రంగా బాధపడుతూ హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్నారు. కాగా అక్కడ ఆపరేషన్ కోసం లక్ష యాభై వేల రూపాయలు ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలిపి అందుకు ఎస్టిమేషన్ ఇవ్వగా వారు టీ.ఆర్.ఎస్ లోక్ సభపక్ష నేత,ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావుని కలసి పరిస్థితి వివరించగా ఎంపీ నామ నాగేశ్వరరావు సిఫార్సు మేరకు సీఎం సహాయ నిధి నుండి చికిత్స కోసం రూ. 150000/- ఎల్ఓసీని మంజూరు చేశారు. శనివారం నాడు హైదరాబాద్ లో ఎంపీ నామ తన కార్యాలయంలో లబ్ధిదారుడికి ఎంపీ నామ నాగేశ్వరరావు గారు అందించారు.

## నూతన యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీకి సన్మానం - కాంగ్రెస్ నేతలు



**మెట్‌పల్లి, డిసెంబర్ 5 (ప్రజాపాలన) :** కోరుట్ల నియోజకవర్గంలో గత రెండు రోజుల క్రితం జరిగిన యూత్ కాంగ్రెస్ ఎలక్షన్లలో కోరుట్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీగా గెలిచిన మహమ్మద్ మొయిజ్ అన్వర్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొమిరెడ్డి లింగారెడ్డి, మెట్ పల్లి మైనారిటీ టౌన్ జనరల్ సెక్రెటరీ మహమ్మద్ అఫ్రోజ్, పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు మారుపాక రాజేశ్వర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు హానిప్, బండి రాజు ప్రవీణ్, శేఖర్ ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అధ్యక్షులు, బిజెపి నేతలు గెలిచిన బిజెపి కార్పొరేటర్లు సమావేశం



**బాలాపూర్ : ప్రజాపాలన న్యూస్ :** గ్రేటర్ హైదరాబాద్ ఎలక్షన్ ముమ్మరంగా జరిగిన ఎన్నికలలో సరూర్నగర్ లోనీ 19 వ డివిజన్ కార్పొరేటర్ బిజెపి ఆకుల శ్రీవాణి అంజన్ టిఆర్ఎస్ పార్టీ మీద అధిక మెజార్టీతో గెలుపొంది. శనివారం బిజెపి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ కుమార్ బిజెపి ఆఫీసులోను కలిసి బిజెపి నేతలతో సమావేశం నిర్వహించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ గెలిచిన వారికి మిఠాయిలు పంచి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆకుల శ్రీవాణి అంజన్ కుమార్ బిజెపి నేతలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ, 19 వ డివిజన్ అభ్యర్థి శ్రీ వాణి బిజెపి పార్టీ ని ఎల్లవేళలా బలోపేతానికి కృషి చేస్తానని హామీ ఇస్తూ, బిజెపి పార్టీ నియమ నిబంధనలు పాటిస్తానని చెప్పారు. కేంద్రం నుంచి వచ్చే పథకాలు ప్రజలకు వివరిస్తానని బిజెపి పార్టీ కి రుణపడి ఉంటానని అన్నారు.

## బిజెపి నాయకులు విజయోత్సవ సంబరాలు



**సారంగాపూర్, డిసెంబర్ 05 (ప్రజాపాలన):** సారంగాపూర్ మండల కేంద్రంలోని బిజెపి నాయకులు జిహెచ్ఎంసి ఎన్నికల్లో అధిక సీట్లు సాధించడంతో విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. 2023 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ జెండా తెలంగాణ రాష్ట్రంలో రెప రెపలాడే విదంగా కార్యాచరణతో ముందుకు సాగాలని బీజేపీ మండల్ అధ్యక్షుడు జిల్లా దిశ కమిటీ సభ్యుడు ఎండబెట్ల వరుణ్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాణా సంచా కాల్చి మిఠాయిలతో సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బద్దెల గంగారాజం ఉరుమల్ల నగేష్ చెరుకు గంగారెడ్డి కంచర్ల శివ ఆనంతుల స్వామి శాంతయ్య మల్లేష్ ప్రమోద్ ఏశాల రాజు పాలగొని మల్లేష్ తెలు నరేష్ నీలి నరేష్ కంపెల్లి శేఖర్ మారంపెల్లి సతీష్ తోట సంతోష్ ఆకుల పొశన్న శరత్ తిరుపతి పాల్గొన్నారు.

# యువత మావోయిజం వైపు ఆకర్షితులు కాకుండా చర్యలు





### రామగుండం సిపి వి. సత్యనారాయణ

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 5, ప్రజాపాలన :** యువత మావోయిజం వైపు ఆకర్షితులు కాకుండా ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని రామగుండం సిపి వి. సత్యనారాయణ తెలిపారు. శనివారం రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో బెల్లంపల్లి పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో ఉమ్మడి ఆదిలాబాద్ "నాలుగు జిల్లాల" స్పెషల్ పార్టీ సిబ్బందికి గ్రేహౌండ్స్ తరహా శిక్షణ కోసం ఏర్పాటు చేసిన బి.ఓ.ఏ.సి (బ్యాటిల్ అబ్స్టాకిల్స్ అసల్ట్ కోర్స్) ని రామగుండం పోలీస్ కమిషనర్ వి. సత్యనారాయణ ఐపీఎస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేహౌండ్స్ సిబ్బంది వామపక్ష తీవ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు, నక్సలైట్ల ఏరివేతకు వారి శిక్షణ తరహాలో రామగుండం పోలీస్ కమీషనరేట్, ఉమ్మడి ఆదిలాబాద్ స్పెషల్ పార్టీ మొదటి బ్యాచ్ 60 సిబ్బందికి ఫిజికల్ ఫిట్‌నెస్, ఆయుధ వినియోగం, అవసరాన్ని బట్టి అనుసరించాల్సిన టాక్టికల్ ఆపరేషన్స్ వ్యూహం కోణంలో శిక్షణ ఇచ్చే విషయమై ఇందుకు ప్రత్యేక శిక్షణ, మెళకువలతో కూడిన శిక్షణ కార్యక్రమాన్ని రూపకల్పన చేసి శిక్షణ ఇవ్వడం జరుగుతుంది అన్నారు. అడవుల్లో పోరాటంపై ప్రధానంగా బలగాలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కూంబింగ్, ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్, అడవుల్లో సంచరిస్తూ మావోల కదలికలపై ఎప్పటికప్పుడు ప్రత్యేక దృష్టి సారించాలి అన్నారు. డీసీపీ మంచిర్యాల ఉదయ్ కుమార్ రెడ్డి, అడిషనల్ డీసీపీ ఓఎస్ డి ఆపరేషన్ శరత్ చంద్రపవర్, అడిష నల్ డీసీపీ ఏఆర్ సంజీవ్, ఏసీపీ బెల్లంపల్లి రహెమాన్, ఏసీపీ ఏఆర్ నాగయ్య, ట్రైనింగ్ ఐపీఎస్ అశోక్ కుమార్ ఆర్ఐలు అనిల్, అంజ న్న, ఆర్ఎస్ ఐ లు, పోలీస్ సంఘం అధ్యక్షులు బోర్లకుంట పోషలింగం, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి పథంలో బూర్గంపహాడ్ గ్రామ పంచాయితీ



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ ప్రజాపాలన :** బూర్గంపహాడ్ గ్రామ పంచాయితి అభివృద్ధిలో మరో ముందడుగు ఇటీవల కాలంలో గ్రామ అభివృద్ధిలో భాగంగా పంచాయితి పరిధిలో పలు సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. అందులో భాగంగా శనివారం 5 కల్వర్టులకు సర్పంచ్ సిరిపురపు స్వప్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ అభివద్ధే ధ్యేయంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు ఇప్పటికే పలు సిసి రోడ్లు,కల్వర్టుల నిర్మాణం చేపట్టామని తెలిపారు. పచ్చదనం పారిశుధ్యం పనుల్లో భాగంగా ప్రతిరోజు పలు కార్యక్రమాలు చేపడున్నామని అన్నారు .తెలంగాణ ముఖ్యమంత్రి కేసిఆర్ పల్లెల అభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. పల్లె ప్రకృతివనాలు,డంపింగ్ యార్డు, స్మశాన వాటికలు నిర్మాణాలతో పాటు పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా హరితహారం చేపట్టారని వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సాగరిక,అప్పల నాయుడు, సొసైటి డైరెక్టర్ బొల్లు రవి, గ్రామస్తులు మేకల నరసింహారావు,భజన ప్రసాద్ పాల్గొన్నారు.

## జి.హెచ్.ఎం.సి ఎన్నికల్లో 48 డివిజన్లో విజయం



**వెల్గటూర్, డిసెంబర్ 05 (ప్రజాపాలన) :** వెల్గటూర్ మండల కేంద్రం అంబేద్కర్ కూడలి వద్ద శనివారం రోజు జి.హెచ్.ఎం.సి ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ 48 డివిజన్లలో ఘన విజయం సాధించినందుకు మండల కేంద్రంలో మండల అధ్యక్షులు తంగల్లపల్లి చక్రపాణి ఆధ్వర్యంలో బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎం.పీ.టీ.సీ లు గాజుల మల్లేషం, జాడి సుజాత రాజేషం, జిల్లా కార్యవర్గ సభ్యులు గుంత సంతోష్,మాజీ మండల ప్రధాన కార్యదర్శి బైకని రవీందర్, సింగిల్ విండో డైరెక్టర్ బైకని శంకర్, మండల ప్రధాన కార్యదర్శులు రాయిల్ల రాజు,జక్కుల శేఖర్, ఉపాధ్యక్షులు గుమ్ముల సతీష్,వోడిగ రవి, నస్పూరి నరసింహ చారి, కార్యదర్శులు జక్కుల రాజుకుమార్, సంజీవ్, బి.జే.వై.యం జిల్లా అధికార ప్రతినిధి తిరుమల ప్రమోద్, బి.జే.వైయం మాజీ మండల అ.ధ్యక్షులు అమ్ములనరేష్ ,బిజే.వై.యం మండల అధ్యక్షులు దేవి రవీందర్, ప్రధానకార్యదర్శి కూస మహేష్, కిసాన్ మోర్చా ప్రధానకార్యదర్శి బుద్దె పోచయ్య, వాణిజ్య సెల్ అధ్యక్షులు మల్యాలదేశ్ముకు,మండల నాయకులు గొంటి కిరీటి,గాజుల గంగయ్య, ఎనగందుల తిరుపతి, బత్తిని నాగరాజు,పెసర్ సత్తయ్య, దోరశెట్టి సాయిలు,గోపనవేటన గణేష్,శ్రీను,కార్యకర్తలు పాల్గొన్నారు.

## టిఆర్ఎస్ అధికార దాహానికి చెంప పెట్టు జిహెచ్ఎంసి ఫలితాలు

వికారాబాద్ జిల్లా బిజెపి అధ్యక్షుడు తొడిగల సదానంద్ రెడ్డి



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 5 (ప్రజాపాలన) :** టిఆర్ఎస్ అధికార దాహానికి జిహెచ్ఎంసి ఎన్నికలు చెంపపెట్టని వికారాబాద్ జిల్లా బిజెపి అధ్యక్షుడు తొడిగల సదానంద రెడ్డి ఎద్దేవా చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో జిహెచ్ఎంసి ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు కార్పొరేటర్లుగా గెలుపొందిన సందర్భాన్ని పురస్కరించుకొని బసవేశ్వర విగ్రహం దగ్గర పటాకులు కాల్చిన అనంతరం అక్కడి నుండి బిజేఆర్ చౌరస్తా వరకు ఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ జిహెచ్ఎంసి ఎన్నికలలో ఏ విధంగానైనా గెలుచుటకు ఎన్ని అడ్డదారులు తొక్కి అయినా మేయర్ పీఠాన్ని దక్కించుకోవాలని కుతూహల పడ్డ సీఎం కేసీఆర్ కు శృంగభంగం దక్కిందని విమర్శించాడు. ఎలక్షన్ కమిషన్ ను పోలీస్ శాఖను తన గుప్పెట్లో ఉంచుకుని కూడా బొక్కా బోర్లాపడ్డాడన్నారు. ఉద్యోగస్తులు విద్యావంతులు సామాన్య ప్రజానీకం సీఎం కేసీఆర్ కు ఓటర్ మహాశయులు సరైన సమయంలో గుణపాఠం నేర్పారు అన్నారు. కుటుంబ పాలనకు చరమగీతం పాడే రోజులు అతి దగ్గరగా ఉన్నాయని గుర్తు చేశాడు. ఒంటెత్తు పోకడలతో మంత్రులను ఎంపీలను ఎమ్మెల్యేలను ఎమ్మెల్సీలను కనుసైగతో శాసించిన ఛండశాసనునికి ఓటమి రుచి చూపించారని అన్నాడు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పై దౌర్జన్యంగా దాడి చేయించిన ఘనత టిఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందని విమర్శించాడు. ఏ ఎన్నికల్లో నైనా టీఆర్ఎస్ అభ్యర్థులను ఒంటిచేత్తో గెలివించుకుంటాననే అహంకారంతో ఎన్నికలకు వెళ్లి భంగపడ్డాడు అన్నారు. దుబ్బాక ఎన్నికలతో టిఆర్ఎస్ పతనం బిజెపి ఎదుగుదలకు దోహదపడుతుందని ఉన్నారు. రాబో యే ఎన్నికల్లో నైనా బిజెపి విజయ దుందుభి మోగించడం ఖాయమని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యుడు మాధవ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోటి గారి శివరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పాండు గౌడ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వివేకానంద రెడ్డి, వికారాబాద్ మండల అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, బిజెపి నాయకులు మడపు బసవలింగం, పోకల సతీష్, సాయి చరణ్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, న్యాయవాది రాములు, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మానవ హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర కార్యదర్శిగా పూణే ప్రదీప్ కుమార్ నియామకం



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం టౌన్, ప్రజా పాలన :** మానవ హక్కుల పరిరక్షణ సంస్థ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా ప్రదీప్ కుమార్ ను హెచ్ ఆర్ సి ఐ సి ఐ నేషనల్ చైర్మన్ సింగనమల వెంకటరమణయ్య నియమించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన పూనం ప్రదీప్కుమార్ మాట్లాడుతూఎంతో బాధ్యత గల ఈ పదవిని ఇచ్చినందుకు జాతీయ అధ్యక్షులు సింగనమల వెంకటరమణయ్య కు కృతజ్ఞతలు తెలిపారు.మానవ హక్కులకు ఎక్కడ భంగం కలిగినా తప్పకుండా ప్రజల పక్షాన నిలబడి సమస్య పరిష్కారం జరిగేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.ప్రజల హక్కుల గురించి ప్రశ్నించే ముందు బాధ్యతతో ఉండాలని సూచించారు ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలిగినా మానవ హక్కుల పరిరక్షణ సంస్థ అండగా ఉండి న్యాయపోరాటం చేస్తుందని ప్రజల హక్కులను కాపాడడంలో వెనకడుగు వేసేది లేదని ఆయన స్పష్టం చేశారు త్వరలోనే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కమిటీలు నియోజకవర్గ మండల కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు ప్రజా సమస్యలపై స్పందించి ప్రజల హక్కుల కోసం పోరాడే వారిని మేధావులను విద్యావంతులను ఎన్నుకునేందుకు కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని ఆయన తెలిపారు మానవ హక్కుల ఉల్లంఘన ఎక్కడ ఏ రూపంలో జరిగినా న్యాయ పోరాటం చేయడంలో ముందుంటామని ఆయన తెలిపారు ఈ నియామకానికి కృషి చేసిన జాతీయ కార్యదర్శి గుణశేఖర్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్ల కు కృతజ్ఞతలు తెలిపారు

## ప్రైవేటు పాఠశాలలకు దీటుగా గైగోళ్ళపల్లి ప్రభుత్వ పాఠశాల



**కూసుమంచి, డిసెంబర్ 5, ప్రజాపాలన :** ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం గురుకులంలో ఉత్తమ ఫలితాలు సాధించిన గైగోళ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు పాఠశాల నుండి 8మంది ప్రవేశ పరీక్ష రాయగా అందులో6గురు కి గురుకులం సీట్లు ప్రైవేటు పాఠశాలలకి ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో 8మందికి గాను 6 సీట్లు సాధించాడనికి విద్యార్థులని తీర్చిదిద్దిన పాఠశాల ఉపాధ్యాయులకి,విద్యార్థులకి అభినందనలు తెలియజేసిన గ్రామ సర్పంచ్,గ్రామస్థులు, యువకులు కూసుమంచి గైగోళ్ళపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలోని 8మంది విద్యార్థులు గురుకుల పాఠశాల 5వ తరగతి ప్రవేశ పరీక్ష వ్రాయగా 6గురు విద్యార్థులు గురుకులం సీట్లు సంపాదించారు. ఇందులో 1) పరకాల.రుచిత-దానవాయిగూడెం,2) యం.తేజస్వీని-ములకలపల్లి-భద్రాది జిల్లా,3)జె.స్పందన -కూసుమంచి-కోదాడ క్రాస్ రోడ్డు,4)యం.భార్గవి-కూసుమంచి, 5)సి.యచ్ నందిని-కూసుమంచి,6) కె.వైష్ణవి-నేలకొండపల్లి గురుకుల పాఠశాలలో సీట్లు సాధించారు,ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో ప్రతివారు తమ పిల్లలని ప్రైవేటు పాఠశాలలో చదివిస్తున్న తరుణంలో,ప్రైవేటు పాఠశాల వద్దు-ప్రభుత్వ పాఠశాల ముద్దు అనే నినాదంతో గైగోళ్ళపల్లి ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకి చక్కని విద్యాబోధనని అందించి గురుకుల పాఠశాల లో 6సీట్లు రావడానికి విద్యార్థులని నైపుణ్యంతో శిక్షణ ఇచ్చిన ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు,వెంకటరమణ,జ్యోతి,శిరిష లకి సర్పంచ్, గ్రామస్థులు అభినందనలు తెలిపారు,ఇలాగే ముందు రోజుల్లో ఇలాగే అత్యధిక ఫలితాలు సాధించి కూసుమంచి మండలంలో అగ్రస్థానంలో నిలవాలని కోరారు.

## మద్యం తాగితే మరణమే!



ఇది మద్యం తాగేవారందరికీ వర్తించే మాటే అంటున్నారు లండన్ పరిశోధకులు. మద్యం ఎక్కువ తాగితే గుండెనొప్పి, గుండెసంబంధిత వ్యాధులతో మృత్యువుకు చేరువవుతారంటున్నారు. సుమారు ఆరులక్షలమంది డ్రింకింగ్ హ్యాబిట్స్ మీదవీరు అధ్యయనం చేశారు. మద్యానికి మితంగా తీసుకుంటే గుండె ఆరోగ్యానికి మంచిదే అయినా దీర్ఘకాలంలో అదేవిషంగా మారే ప్రమాదముందని వారు హెచ్చరిస్తున్నారు. రోజుకి వందగ్రాముల స్వచ్ఛ ఆల్కహాల్‌ను వారంలో ఐదురోజుల పాటు తీసుకుంటే పెద్దగా ప్రమాదముండదనీ, అదే వారంలో పదిసార్లు మద్యం తాగేవారి ఆయుష్షు రెండు సంవత్సరాలు తగ్గిపోతుందనీ, అదే పద్దెనిమిది సార్లు తాగేవారి జీవితకాలం ఐదు సంవత్సరాలు తగ్గిపోతుదనీ వారు స్పష్టం చేస్తున్నారు.

## సిగరెట్ పొగతో గుండెకు చేటు



ధూమపానం, మద్యపానం ఆరోగ్యానికి హానికరం. ఎక్కువగా సిగరెట్లు తాగడం, పొగాకు ఉత్పత్తులను వాడటం వల్ల ఊపిరితిత్తులు త్వరగా పాడవుతాయి.. రక్తపోటు వచ్చే అవకాశమూ ఉంది. అయితే పొగతాగడం వల్ల గుండెకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీ పరిశోధకులు నిర్వహించిన సర్వేలో తేలింది. 55 ఏళ్లు పైబడిన వారిలో హృదయ స్పందనల రేటు సాధారణం కంటే 37శాతం ఎక్కువైనట్లు తమ పరిశోధనలో గుర్తించినట్లు తెలిపారు.

# ఆధునిక చికిత్సలతో రుమటాయిడ్ ఆర్థ్రైటిస్ దూరం



రుమటాయిడ్ ఆర్థ్రైటిస్ జీవితాన్ని నరకప్రాయం చేస్తుంది. ఈ సమస్యకు చికిత్స లేదనే అపోహ చాలా మందిలో ఉంటుంది. అందుకే పెయిన్ కిల్లర్స్ వేసుకుంటూ కాలం వెళ్లదీస్తుంటారు. సమస్య బాగా ముదిరిన తరువాత, కీళ్లు బాగా దెబ్బతిన్న దశలో డాక్టర్ దగ్గరకు పరుగెత్తుతారు. నిజానికి రుమటాయిడ్ ఆర్థ్రైటిస్‌ను ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స తీసుకుంటే సులభంగా బయటపడే అవకాశం ఉంటుందని అంటున్నారు రుమటాలజిస్ట్ డాక్టర్ ధీరజ్.

యుక్తవయస్సులో ఉన్న వారు, వయసు పైబడిన వారు అనే తేడా లేకుండా అందరినీ బాధిస్తోన్న సమస్య ఆర్థ్రైటిస్. అందులో ముఖ్యమైనది రుమటాయిడ్ ఆర్థ్రైటిస్. ఈ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స తీసుకున్నట్లయితే ఎముకలకు నష్టం జరగకుండా, ఇతర సమస్యలు రాకుండా కాపాడుకోవచ్చు. అనేక పరిశోధనల ఫలితంగా రుమటాయిడ్ ఆర్థ్రైటిస్‌కు కొత్త మందులు అందుబాటులో వచ్చాయి. ఈ మందులతో కీళ్లు దెబ్బతినకుండా కాపాడే అవకాశం ఉంది. ప్రాథమిక దశలో గుర్తించడం, చికిత్స త్వరగా ఆరంభించడం, క్రమంతప్పకుండా మందులు వాడటం, వైద్యుల సలహా తీసుకోవడం, అవసరమైన పరీక్షలు చేయించుకోవడం, ఫిజియోథెరపీ, వ్యాయామం చేయడం వంటివి రుమటాయిడ్ ఆర్థ్రైటిస్ నివారణలో చక్కగా ఉపయోగపడతాయి.

వ్యాధిని గుర్తించండిలా....

బిగుసుకుపోవడం : ఉదయాన నిద్ర లేవగానే అరగంట పాటు కీళ్లు బిగుసుకుపోయినట్లుగా ఉండటం జరుగుతుంది.

వాపు : కీళ్లల్లో ముఖ్యంగా చేతి కీళ్లలో వాపులు వస్తుంటాయి.

నొప్పి : కరచాలనం చేసినా, చేతిని ముట్టుకున్నా విపరీతమైన నొప్పి ఉంటుంది.

ఎవరిని కలవాలి?

రుమటాలజిస్ట్‌ను కలవడం ద్వారా సరియైన వ్యాధి నిర్ధారణ జరుగుతుంది. రుమటాయిడ్ ఆర్థ్రైటిస్‌కు ఏ విధమైన చికిత్స అందించాలనే విషయంలో రుమటాలజిస్ట్‌కు నైపుణ్యం ఉంటుంది. రుమటాలజిస్ట్ ఒక ఫిజీషియన్‌గా కీళ్ల నొప్పులపైనే దృష్టి పెట్టడం కాకుండా లింఫ్‌గ్రం?థుల్లో వాపు, గుండె, ఊపిరితిత్తుల పైపొరలో వాపు, వాస్క్యులైటిక్ న్యూరోపతి, వాస్క్యులైటిక్ అల్సర్, ప్లీహం(స్ప్లీన్) పెద్దది కావడం వంటి ఇతర సమస్యలను పరిశీలిస్తారు. గుండె జబ్బులు వచ్చే అవకాశాలను అంచనా వేస్తారు. గుండె జబ్బులు, ఇన్‌ఫెక్షన్లు, శ్వాసకోశ సమస్యలు, ఆర్థ్రైటిస్ మూలంగా పురుషుల్లో ఏడేళ్లు, స్త్రీలలో మూడేళ్ల జీవితకాలం తగ్గిపోతోంది. అందుకే నిర్లక్ష్యం చేయకుండా కీళ్ల నొప్పులు బాధిస్తున్నట్లయితే రుమటాలజిస్ట్‌ను కలవాలి.

డాక్టర్‌ను కలిసిన తరువాత...

అవసరమైన పరీక్షలు చేసి, లక్షణాలు పరిశీలించిన తరువాత వైద్యులు తగిన మందులు సూచిస్తారు. అయితే మందులు తీసుకోవడంతో పాటు కొన్ని జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. అప్పుడే వ్యాధి త్వరగా తగ్గడానికి అవకాశం ఉంటుంది.

మందులు వేసుకోవడం : కీళ్లు దెబ్బతినకుండా ఉండాలంటే వీలైనంత త్వరగా మందులు వాడటం మొదలుపెట్టాలి. మందులు వాడటం వల్ల సైడ్‌ఎఫెక్ట్స్ వస్తాయని భావిస్తుంటారు. కానీ రుమటాలజిస్ట్ అన్ని అంశాలను పరిగణలోకి తీసుకునే మందులు రాయడం జరుగుతుంది. కాబట్టి మందులు వేసుకోవడం మరవద్దు. నొప్పులు తగ్గాయని మందులు ఆపితే : మందులు వేసుకోవడం ప్రారంభించిన తరువాత కొద్ది రోజుల్లోనే నొప్పులు, వాపులు తగ్గుతాయి. మంచి రిలీఫ్ వస్తుంది. దాంతో ఇక మందులు అవసరం లేదని ఆపేస్తుంటారు. కానీ అది చాలా పొరపాటు. మందులు ఆపేయడం వల్ల తిరిగి వాపు, నొప్పి ప్రారంభమవుతుంది. ఆ తరువాత తగ్గడం చాలా కష్టమవుతుంది.

సొంత వైద్యం పనికి రాదు : ఒకసారి వైద్యుల దగ్గరకు వెళ్లి అవే మందులను దీర్ఘకాలం వాడటం వల్ల ప్రయోజనం ఉండదు. ఎందుకంటే వ్యాధి తీవ్రతను బట్టి మందులు వేసుకోవాల్సి ఉంటుంది. అందుకే వ్యాధి తీవ్రతను అంచనా వేయడం, మందులకు రెస్పాన్స్ వస్తున్న తీరు, మందుల వల్ల కలుగుతున్న దుష్ప్రభావాలు వంటివి డాక్టర్ పరిశీలించి మందులను సూచించడం జరుగుతుంది. కాబట్టి సొంత వైద్యం పక్కన బెట్టి క్రమం తప్పకుండా డాక్టర్‌ను సంప్రదించాలి.

శారీరక వ్యాయామం తప్పనిసరి : సంపూర్ణ ఆరోగ్యానికి శారీరక వ్యాయామం బాగా ఉపయోగపడుతుంది. వ్యాయామం వల్ల కీళ్లలో ఫ్లెక్సిబులిటీ వస్తుంది. బిగుసుకుపోవడం తగ్గిపోతుంది.

స్మోకింగ్‌కు స్వస్తి చెప్పండి : పొగతాగే అలవాటు ఉంటే మానేయడం, నోరు పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల రుమటాయిడ్ ఆర్థ్రైటిస్‌తో గుండె జబ్బులు వచ్చే అవకాశం తగ్గిపోతుంది.

డైట్ : రుమటాయిడ్ ఆర్థ్రైటిస్ ఉన్న వారు ఆహార నియమాలు పాటించాలని లేదు. అయితే వారంలో రెండు రోజులు చేపలు తీసుకోవడం వల్ల కార్డియాక్ రిస్క్ తగ్గుతుందని పరిశోధనల్లో తేలింది. చేపల్లో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్‌ఉంటాయి. చేపలు ఇష్టం లేకపోతే వాల్‌నట్స్, సోయాబీన్స్ తీసుకోవచ్చు.

# ఆర్థ్రైటిస్‌తో అన్నీ సమస్యలే...

ప్రస్తుతం మన దేశంలో 15 కోట్లకు పైగా ప్రజలు ఆర్థరైటిసతో బాధపడుతున్నారు. ఒకప్పుడైతే 60 ఏళ్లు దాటాకే ఈ కీళ్లనొప్పుల సమస్యలు ఉండేవి. ఇప్పుడవి 30 ఏళ్ల నుంచే మొదలవుతున్నాయి. కాకపోతే ముందు నుంచే కొద్ది పాటి జాగ్రత్తల్ని తీసుకుంటే సమస్యను తగ్గించుకోవచ్చని చెబుతున్నారు నిపుణులు..

ఏ భవంతిలోకి వెళితే ఏమిటి? ఆర్థరైటిస్ సమస్య ఉన్నవారికి మెట్లు కనబడితే చాలు కీళ్లు తెగిపడుతున్నట్లే అనిపిస్తుంది. ఆ క్రమంలో పిక్కలు తొడలు బిగదీసుకుపోతున్న భావన కలుగుతుంది.. కొద్ది రోజుల్లో కీళ్లల్లో ముఖ్యంగా తొంటి భాగంలో సూదులు గుచ్చినట్లు నొప్పి అనిపిస్తుంది. యుక్త వయస్కుల్లో చాలా మంది ఇంకా నాది చిన్న వయసే కదా ఈ కీళ్లనొప్పులు ఎందుకొస్తాయిలే అనుకుంటారు. అలా ఆ విషయమై నిర్లక్ష్యం వహిస్తారు. దీనివల్ల నేడు దేశంలోని కోట్లాది మంది కీళ్ల సమస్యలు విషమస్థితికి చేరుతున్నాయి. జీవితకాలం బాగా పెరిగిపోతున్న ఈ స్థితిలో చిన్న వయసులోనే కీళ్ల సమస్యలు మొదలైతే, ప్రతి కదలికలోనూ నరకమే కనిపిస్తుంది.

రెండేసి బాధ్యతలు

కీళ్లు ఏకకాలంలో పరస్పర విరుద్ధమైన రెండేసి బాధ్యత ల్ని నిర్వహించాల్సి ఉంటుంది. కీళ్లు అతి మృదువుగా ఉంటూ, సులువైన కదలికలకు అనువుగా ఉండాలి. అదే శరీరం బరువునంతా మోస్తూ స్థిరంగా కూడా ఉండాలి. కాకపోతే కీళ్ల మధ్య కీళ్లు సులువుగా కదిలేందుకు వీలయ్యే షాక్ అబ్‌సార్బర్స్ అంటే కార్టిలేజ్ ఉంటుంది. కీళ్ల మధ్య కొన్ని ద్రవాలు ఉత్పన్నం కావడం వల్ల కీళ్లు కదలికలో ఒరిపిడి ఏదీ జరగకుండా ఒక జిగట పదార్థం అందులో ఉంటుంది. అయితే, ఎముకల్లా కార్టిలేజ్‌లో రక్తనాళాలు గానీ, నరాలుగానీ ఏమీ ఉండవు. ఈ కారణంగా ఎప్పుడైనా కార్టిలేజ్ దెబ్బ తిన్నప్పుడు నొప్పి అనిపించదు. అలాగే దెబ్బ తిన్న కార్టిలేజ్ తిరిగి తనను తాను చక్కబరుచుకునే స్థితి కూడా ఉండదు. చాలా సార్లు కార్టిలేజ్ 40 నుంచి 50 శాతం వరకు దెబ్బ తినే దాకా ఏమీ అనిపించదు. సమస్య 60 శాతం దాకా చేరాకే నొప్పి తెలుస్తుంది. కాకపోతే ఆ నొప్పి తెలిసే నాటికి పరిస్థితి బాగా విషమించి ఉంటుంది.

ఆస్టియోఫైట్స్‌తో చిక్కు

సహజంగానే మనం వేసే ప్రతి అడుగులోనూ మన శరీరం బరువుకు మూడు రెట్లు కీళ్ల మీద, తొంటి భాగాల్లోనూ ఒత్తిడి పడుతుంది. ఈ ఒత్తిడి వల్ల కార్టిలేజ్ లోని నీరు ఎముకల మ?ధ్యలోకి వెళుతుంది. ఒకసారి ఒత్తిడి తొలగిపోతే కార్టిలేజ్‌లోని నీరు తిరిగి కార్టిలేజ్‌లోకి వెళుతుంది.చాలాసార్లు 40 నుంచి 55 ఏళ్ల లోపు వారిలో కాండ్రోసైట్ కణజాలం ఉత్పత్తులు తగ్గుతాయి.

దీనివల్ల దెబ్బతిన్న కార్టిలేజ్ తిరిగి చక్కబడటానికి చాలా ఎక్కువ కాలం పడుతుంది. ఆరోగ్యవంతమైన కార్టిలేజ్ చక్కబడటానికి దోహదం చేసే ప్రొటీన్ల ఉత్పత్తి తగ్గడంతో కొన్ని రకాల ఎంజైములు పెరిగిపోయి కార్టిలేజ్ మరింత దెబ్బ తినే పరిస్థితి ఏర్పడుతుంది. కార్టిలేజ్ కణాల ఉత్పత్తి తగ్గే సరికి దాని పెరుగుదల వేగం తగ్గిపోతుంది. ఆర్థరైటిక్ సమస్య తీవ్రమవుతున్న క్రమంలో కీళ్లల్లో అసహజమైన పెరుగుదల మొదలవుతుంది. శరీరంలోని వ్యాధి నిరోధక వ్యవస్థ అస్తవ్యస్తమవుతుంది. సినోవియల్ ఫ్లూయిడ్‌లోని తెల్ల రక్త కణాలు కీళ్లల్లోకి ప్రవేశించడంతో ఆస్టియోఫైట్స్ అనే హానికారక బొడిపెలు పెరగనారంభిస్తాయి. ఇవి కీళ్లకదలికల నడుమ రాపిడికి కారణమై కీళ్లనొప్పిని తీవ్రతరం చేస్తాయి. ఒక దశలో నడవడం మరీ కష్టమవుతుంది.

నివారించలేమా?

ఆస్టియో ఆర్థరైటిస్ నుంచి పూర్తిగా బయటపడే అవకాశాలు లేకపోవచ్చు. కాకపోతే కార్టిలేజ్‌ను గరిష్టంగా ఆరోగ్యంగా చూసుకునే అవకాశం ఉంటుంది.

ఎల్లవేళలా కీళ్లు సలువుగా కదిలేలా చూసుకోవాలి. వారికి తీవ్రస్థాయి ఒత్తిడి కీళ్లమీద, తొంటి మీద పడకుండా చూసుకోవాలి. మీ శరీరం ఏం చెబుతోందో ముందు గమనించండి.

విటమిన్-సి, డి లు తగ్గిపోవడం కూడా ఆర్థరైటిస్ పెరగడానికి కారణమవుతూ ఉంటుంది. మద్యం తీసుకునే అలవాటు ఉంటే అతి తక్కువ మోతాదులోనే తీసుకోవాలి.

కీళ్ల మీద భారం పడకుండా , తక్కువ మోతాదు బరువులను మాత్రమే మోయాలి. కీళ్ల సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే కండరాలను బలోపేతం చేయడం తప్పనిసరి.

భంగిమల మార్పు ఈ రోజుల్లో అతి ముఖ్యమైనది. ఉద్యోగ వ్యాపారాలు చేసే వారు ఎక్కువ గంటలు కూర్చునే ఉంటారు. అందువల్ల ప్రతి గంటకు ఒకసారైనా శరీరం అప్పటిదాకా ఉన్న భంగిమకన్నా భిన్నంగా ఉండేలా చూడాలి.

ఎముకల దారుఢ్యం కోసం కాల్షియం ఎక్కువగా ఉండే ఆకు కూరలు తప్పనిసరి తీసుకోవాలి.

# ఆధునిక సర్జరీలతో వెన్నుకు దన్ను

వెన్నెముకకు సంబంధించిన వ్యాధి అంటే ఒకప్పుడు ప్రాణభయంతో గిలగిలలాడే పరిస్థితి. సాంప్రదాయక సర్జరీలు చేయించుకుంటే వారాల తరబడి ఆసుపత్రిలో ఉండాల్సి రావడం, శరీరంపైన పొడవైన గాటు పడడం, దీంతో నొప్పి ఎక్కువ రోజులు ఉండడం వంటివి జరిగేవి. 'మినిమల్లీ ఇన్వేసివ్ స్పైన్ సర్జరీ' వల్ల ఈ సమస్యలన్నీ దూరమైపోయాయని, అతి చిన్న గాటుతో ఎండోస్కోపి విధానంలో జరిగే ఈ వెన్ను సర్జరీల సురక్షితమైనవి అంటున్నారు ప్రముఖ స్పైన్ సర్జన్ డాక్టర్ జిపివి సుబ్బయ్య. వెన్నుకు సంబంధించిన అత్యంత అధునాతన సర్జరీగా మినిమల్లీ ఇన్వేసివ్ స్పైన్ సర్జరీ(ఎంఐఎస్ఎస్) ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది. అతి చిన్న గాటుతో సర్జరీ చేయడం, తక్కువ కాలం ఆసుపత్రిలో ఉండడం, సర్జరీ అనంతరం ఎటువంటి దుష్ప్రభావాలు ఉండకపోవడం వంటి ఎన్నో ప్రయోజనాలు లభ్యమవుతున్న ఈ సర్జరీ ఇప్పుడు అత్యంత ప్రజాదరణ పొందిన సర్జరీగా చెప్పవచ్చు. వెన్నెముకకు సంబంధించిన అన్ని సమస్యలను ఈ సర్జరీ ద్వారా సులభంగా నయం చేయవచ్చు.

అత్యంత సురక్షితమైన సర్జరీ

మినిమల్లీ ఇన్వేసివ్ స్పైన్ సర్జరీ అత్యంత సురక్షకితమైనది. ఈ సర్జరీని చాలా చిన్న గాటుతో చేస్తారు. పేషెంట్ చాలా శీఘ్రంగా కోలుకోవడం జరుగుతుంది. సర్జరీ తర్వాత ఎటువంటి దుష్ప్రభావాలు తలెత్తవు.

సూక్ష్మమైన ఒక చిన్న రంధ్రాన్ని వీపు కండరాల ద్వారా వెన్నెముక వరకు వేయడం జరుగుతుంది. దీని వల్ల కణజాలానికి ఎక్కువ నష్టం జరగదు. అదే సాంప్రదాయక సర్జరీలో కణజాలానికి చాలా నష్టం జరుగుతుంది.

సాంప్రదాయక సర్జరీలో వీపు భాగాన ఒక పెద్ద కోతను వేస్తారు. అదే ఎంఐఎస్ఎస్‌లో ఒకటి, లేదా రెండు చిన్న గాట్లులు వేస్తారు. అవి ఒక అంగుళం కన్నా తక్కువే ఉంటాయి.

సర్జరీ ఎలా చేస్తారు?

మినిమల్లీ ఇన్వేసివ్ స్పైన్ సర్జరీని 'కీ హోల్ సర్జరీ'గా కూడా వ్యవహరిస్తారు. ఈ సర్జరీలో ఒక సూక్ష్మమైన టెలిస్కోప్(ఎండోస్కోప్ అంటారు)ను చిన్ని గాట్ల ద్వారా వెన్నెముక వద్దకు పంపిస్తారు. ఈ ఎండోస్కోప్‌నకు ఒక చిన్న వీడియో కెమెరాను జతచేస్తారు. దీని వల్ల పేషెంట్ శరీరంలోపలి భాగాన్ని ఆపరేషన్ రూమ్‌లోని టెలివిజన్ తెరల మీద చూడవచ్చు. నడుము బాగంలో అదనంగా అర అంగుళం పరిమాణంలో ఒకటి, రెండు రంధ్రాలను వేసి వాటి ద్వారా సర్జికల్ పరికరాలను శరీరంలోపలకు పంపిస్తారు. ఈ రంధ్రాలపై సర్జికల్ టేపులు వేయడం వల్ల ఏర్పడిన మచ్చలు కొద్ది నెలల్లోనే శరీరంపైన మాయమవుతాయి.

ప్రయోజనాలు

మినిమల్లీ ఇన్వేసివ్ స్పైన్ సర్జరీ ద్వారా వెన్నెముకకు సంబంధించిన సమస్యను శీఘ్రంగా, నిర్దిష్టంగా గుర్తించవచ్చు. సర్జరీ తర్వాత హాస్పిటల్‌లో తక్కువ రోజులు ఉండడం, త్వరగా కోలుకోవడం జరుగుతుంది. సర్జరీ కారణంగా కణజాలానికి నష్టం తక్కువ స్థాయిలో ఉంటుంది. దీని వల్ల నొప్పి కూడా తక్కువగా ఉంటుంది.


సర్జరీ తర్వాత ఇన్‌ఫెక్షన్లు వచ్చే అవకాశాలు తక్కువ. శరీరంపై గాటు సూక్ష్మంగా ఉంటుంది. దీని వల్ల త్వరగా గాయం మాని మచ్చ కూడా కనిపించకుండా ఉంటుంది.

సర్జరీ ద్వారా ఏర్పడే రక్తహీనత ఉండదు. దీంతో బలహీనపడే అవకాశం రాదు.

ఈ సర్జరీ తర్వాత మరుసటి రోజే హాస్పిటల్ నుంచి డిస్చార్జ్ కావచ్చు. అయితే కొన్ని కీలక సర్జరీల విషయంలో మాత్రం మూడు, నాలుగు రోజులు హాస్పిటల్‌లో ఉండాల్సి ఉంటుంది. ఐదు నుంచి పది రోజుల్లో పేషెంట్ విధులకు హాజరుకావచ్చు.

ఎవరికి ఈ సర్జరీలు అవసరం?

డిస్కులు జారడం లేదా పక్కకు జరిగినప్పుడు.



డిస్కులు అరిగిపోవడం, గాయపడడం లేదా స్పాండిలోలిస్తసిస్(ఒక వెన్నెముక మీద మీద మరో వెన్నెముక వాలడం) ఏర్పడినప్పుడు.

స్కోలియోసిస్ అంటే డిస్కుల లోపాలను సరిచేసినప్పుడు.

పక్కకు జరిగిన డిస్కులను తొలగించినప్పుడు.

అందరికీ ఈ సర్జరీ చేయవచ్చా?

మినిమల్లీ ఇన్వేసివ్ స్పైన్ సర్జరీని పేషెంట్స్ అందరికీ చేయవలసిన అవసరం ఉండదు. ప్రతి పేషెంట్‌ను వ్యక్తిగతంగా పరీక్షించిన తర్వాత అవసరాన్ని బట్టి ఈ సర్జరీ చేయాల్సి ఉంటుంది.

## అరిగిన డిస్కులకు ఆయుర్వేదమే శరణ్యం

వెన్నునొప్పి మౌలికంగా ధాతుక్షయంతో ఏర్పడిన సమస్య. పెయిన్ కిల్లర్స్ ఇచ్చి ఆ నొప్పిని ఎన్నాళ్లని కప్పిపుచ్చుతారు. సర్జరీ చేసి ఏం సాధిస్తారు? మొత్తంగా వెన్నుముకను పరిపుష్ఠం చేయకపోతే, ఒక్కొక్క డిస్కూ అరిగి, ఒరిగిపోవడం తప్ప ఫలితమేమీ ఉండదు. ఏళ్ల తరబడి కొనసాగే వెన్నునొప్పి వల్ల వృత్తి సామర్థ్యాన్నే కాదు సహజమైన జీవశక్తినే కోల్పోతారు. అందులో భాగంగానే ఒక దశలో లైంగిక శక్తి కూడా అడుగంటిపోతుంది. ఇదంతా మొత్తంగా వెన్నెముకను బలోపేతం చేయకపోవడం వల్ల ఏర్పడిన దుర్దశ. ఆయుర్వేద వైద్యవిధానం ఇందుకు పూర్తిగా భిన్నమైనది. సప్తధాతువుల్నే కాకుండా మొత్తంగా వెన్ను వ్యవస్థనే శక్తివంతం చేసి వెన్నునొప్పి నుంచి సంపూర్ణ విముక్తిని కలిగిస్తుంది అంటున్నారు ఆయుర్వేద వైద్యనిపుణులు డాక్టర్ వర్ధన్.

చెద లు పట్టిన మూలస్థంభంలా వెన్నెముక తయారైతే, మనిషికింక బతుకేముంటుంది? బతుకు, భవిష్యత్తుల మాటెందుకు గానీ, అసలు కదల్లేని స్థితి ఏర్పడుతుంది కదా! నొప్పిని భరించలేక కొందరు అదేపనిగా పెయిన్ కిల్లర్సు వేసుకుంటారు. ఇవి నొప్పి తెలియకుండా ఆ భాగాన్ని మొద్దుబరుస్తాయే తప్ప నొప్పిని తీసేయవు. పైగా వీటిని ఎక్కువకాలం అలా వాడుతూ ఉండిపోతే, పలురకాల జీర్ణాశయ సమస్యలు వస్తాయి. వాటిలో ముఖ్యంగా కడుపునొప్పి నుంచి అల్సర్‌దాకా, ఐబిఎస్ నుంచి రక్తస్రావం దాకా ఏమైనా రావచ్చు. కొందరిలో ఇవి మలబద్ధకాన్నీ, వాంతీ, వికార భావాల్నీ కలిగిస్తాయి. మగతనూ, మజ్జుతనాన్నీ నింపుతాయి. మరీ ఎక్కువ కాలం వాడితే ఇవి గుండె రక్తనాళాలనూ దెబ్బ తీయవచ్చు. రక్తం గడ్డకట్టుకుపోయేలా చేసి పక్షవాతానికి కూడా దారితీయవచ్చు. కొంతకాలం దాకా పెయిన్‌కిల్లర్స్‌ను అలా కొనసాగిస్తూ పోతే, ఒకదశలో వాటికి బానిసైపోయి రోజూ వేసుకుంటే తప్ప నిద్రపట్టని పరిస్థితి ఏర్పడుతుంది. కేవలం కొద్ది పాటి ఉపశమనాన్ని ఇచ్చే పెయిన్ కిల్లర్స్ శరీరాన్ని ఇన్నిన్ని దుష్పరిణామాల పాలు చేస్తాయి. స్టెరాయిడల్ షాట్స్ తీసుకున్న వారికి కూడా రెండు నుంచి ఆరునెలలే ఉపశమనంగా ఉంటుంది. నిజానికి మొత్తం జీవితకాలంలో రెండు, మూడు సార్లకు మించి వాటిని తీసుకోవడానికి వీలేలేదు. ఈ సైరాయిడ్స్ దుష్ప్రభావాల్లో కొన్ని స్వల్ప కాలికంగా ఉండిపోతే, మరికొన్ని దీర్ఘకాలికంగా ఉంటాయి. స్వల్పకాలికమైన వాటిలో ఇన్‌ఫెక్షన్లు లోనికి ప్రవేశించవచ్చు. అక్కడున్న కండరాలు, టెండాన్లు, లిగమెంట్లు దెబ్బతినిపోవచ్చు. దీర్ఘకాలిక దుష్ప్రభావాల్లో స్టెరాయిడ్స్ వల్ల శరీరం బరువు పెరుగుతుంది. వీటితో పాటే రక్తపోటు, షుగర్ నిలువలు కూడా పెరిగిపోయే ప్రమాదం ఉంది. స్టెరాయిడ్స్ వల్ల వ్యాధినిరోధక శ క్తి కూడా తగ్గిపోయి శరీరం ఇన్‌ఫెక్షన్ల బారిన పడే ప్రమాదం ఉంది. ఒకదాని తరువాత ఒకటిగా నిరంతరం శరీరం రోగగ్రస్తమయ్యే స్థితి ఏర్పడుతుంది.

సర్జరీతో ఏమవుతుంది?

ప్రపంచ ఆరోగ్య సంస్థే స్వయంగా చెప్పినట్లు, వెన్నునొప్పి బాధితుల్లో కేవలం 5 శాతం మందికే అంటే మలమూత్రాలు ఆగిపోయిన దశలో సర్జరీ అవసరమవుతుంది. మిగతా 95 మందికి సర్జరీ అవసరం లేదు. సర్జరీ కోసం డబ్బు భారీమొత్తమే ఖర్చవుతుంది. అయితే అంత ఖర్చు చేసి సర్జరీ చేయించుకుని కూడా ఆ తరువాత ఎంతో భారీ నొప్పిని భరించాల్సి వస్తోంది.డిస్కులన్నీ అరిగీ అరిగీ శిథిలావస్తకు చేరడమే ఇందుకు కారణం. వాస్తవానికి సర్జరీ లేకుండానే ఈ 95 శాతం వెన్నునొప్పి సమస్యలను నయం చేసే అవకాశాలు ఉన్నాయి. వెన్నునొప్పి కారణంగా సర్జరీ చేయించుకున్న వారినీ, చేయించుకోని వారినీ పరిశీలిస్తే ఓ ఐదేళ్ల తరువాత ఇద్దరిలోనూ నొప్పి పరిస్థితీ ఒకేలా ఉందని శాస్త్రీయ అధ్యయనాల్లోనే స్పష్టమయ్యింది.

ఆయుర్వేద విశేషం

వెన్ను చికిత్సల్లో చాలా వరకు సమస్య మూలాల్ని తెలుసుకుని చేసినవి కావు. పెయిన్ కిల్లర్స్ అయినా, స్టెరాయిడల్ షాట్స్ అయినా, చివరికి సర్జరీ అయినా ఎంతసేపూ బయటికి కనిపించే లక్షణాల్ని దృష్టిలో ఉంచుకుని చేసినవే. అందుకే అవి తాత్కాలిక ఉపవమనాన్నే ఇస్తున్నాయి. పైగా డిస్కులో సమస్యఉంది కాబట్టి ఆ డిస్కును మార్చేస్తే సరిపోతుందనుకుంటే అంతకన్నా పెద్ద పొరపాటు మరొకటి ఉండదు. అందుకే ఆ డిస్కు దెబ్బతినడానికి దారి తీసిన మొత్తం కారణాల్ని పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. అందుకే ఆయుర్వేదం మేరు చికిత్సకు అత్యధిక ప్రాధాన్యతనిస్తుంది. మేరుచికి త్స వెన్నునిర్మాణాన్నీ చక్కబరుస్తుంది. అదే క్రమంలో కడుపులోకి ఇచ్చే కొన్ని ఔషధాలు మొత్తం వెన్ను వ్యవస్థనే నిలబెడ తాయి. ఎవరికైనా వెన్ను సమస్యలు మొదలయ్యాయి అంటే అస్థిధాతువులో లోపం ఏర్పడిందని అర్థం. అస్థిధాతువు అనేది దానికదిగా విడిగా ఏర్పడిన నిర్మాణం కాదు. రసధాతువు, రక్తధాతువు, మాంసధాతువన్ ఈ మూడూ శక్తివంతంగా ఉన్నప్పుడే అస్థిధాతువు స్థిరంగా ఉంటుంది. ఆ క్రమంలో లైంగిక శక్తికి మూలమైన శుక్రధాతువూ బలపడుతుంది. ఆయుర్వేద వైద్యంతో వెన్ను, సయాటికా సమస్యలు తొలగిపోవడానికి సప్తధాతువుల్నీ శక్తివంతంగా మార్చడమే కారణం. అనుబంధ వ్యవస్థల్ని చక్కదిద్దే మూల వైద్యం చేయనిదే ఏ వ్యాధినుంచైనా ముక్తి లభించదు. వెన్నునొప్పి చికిత్సలో అది మరీ ముఖ్యం. వెన్నునొప్పికి ఒకవేళ అప్పటికే సర్జరీ జరిగి ఉంటే, వారు కూడా ఆయుర్వేద చికిత్సలు తీసుకుంటే మరోసారి ఆ సమస్య తలెత్తకుండా ఉంటుంది.



## ప్రశాంత్ నీల్ నిర్ణయంతో ఉసూరుమంటున్న ఎన్టీఆర్ అభిమానులు




ఎన్టీఆర్.. ప్రశాంత్ నీల్ ల కాంబో లో ఒక సినిమా రాబోతుంది అంటూ గత కొన్నాళ్లుగా అభిమానులు వెయిట్ చేస్తున్నారు. కాని అనూహ్యంగా ప్రశాంత్ నీల్ కేజీఎఫ్ 2 పూర్తి అవ్వడమే ఆలస్యం వెంటనే ప్రభాస్‌తో సినిమా చేయబోతున్నట్లుగా ప్రకటించాడు. సలార్ అంటూ టైటిల్ ను కూడా ప్రకటించిన నేపథ్యంలో ఎన్టీఆర్ అభిమానులు ఉసూరుమంటున్నారు. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ పాన్ ఇండియా మూవీ వస్తుందని అంతా ఆశ పడ్డారు. కాని ప్రశాంత్ నీల్ తదుపరి సినిమా ప్రభాస్ తో అవ్వడం వల్ల ఎన్టీఆర్ పాన్ ఇండియా సినిమా కోసం మరో దర్శకుడిని చూసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం ఆర్ఆర్ఆర్ సినిమాలో నటిస్తున్న ఎన్టీఆర్ మార్చి తర్వాత త్రివిక్రమ్ దర్శకత్వంలో ఒక సినిమాను చేయబోతున్నాడు. త్రివిక్రమ్ దర్శకత్వంలో ఎన్టీఆర్ చేయబోతున్న మూవీ పాన్ ఇండియా రేంజ్ లో ఉంటుందని అభిమానులు ఆశించడం లేదు. త్రివిక్రమ్ తెలుగులో సెన్సేషనల్ సక్సెస్ అయితే ఇవ్వగలడు. కాని పాన్ ఇండియా రేంజ్ మూవీని అయితే ఇవ్వడం అనుమానమే అన్న ఆలోచనలో వారు ఉన్నారు. ఈ సమయంలోనే ఎన్టీఆర్ కోసం మరే దర్శకుడు అయినా పాన్ ఇండియ స్క్రిప్ట్ ను తీసుకు వస్తే బాగుండు అన్నట్లుగా అభిమానులు వెయిట్ చేస్తున్నారు. ఆర్ఆర్ఆర్ సినిమాతో వచ్చే క్రేజ్ ను కంటిన్యూ చేయగల సత్తా ప్రశాంత్ నీల్ కు ఉంది. కాని ఆయన తో ఎన్టీఆర్ సినిమా ఎప్పు డు ఉంటుందో చెప్పలేని పరిస్థితి. ఇలాంటి నేపథ్యంలో ఎన్టీఆర్ అభి మానులు పాన్ ఇండియా మూవీ కోసం పలువురు స్టార్ దర్శకుల వైపు చూస్తున్నారు. త్రివిక్రమ్ తో మూవీ తర్వాత అయినా ప్రశాంత్ నీల్ తో సినిమా చేస్తే బాగుండేది అంటూ అభిమానులు కోరుకుం టున్నారు.

## కత్రిన టోన్డ్ ఫిట్ బాడీ వెనక కఠోర నగ్నసత్యం



పర్ఫెక్ట్ టోన్డ్ బాడీతో ఫిట్ గా కనిపించే కత్రిన అందం ఆరోగ్యం తీరైన రూపం వెనక అసలు రహస్యం ఏమిటో లీకైపోయింది. ఆ మనోహర మైన ధేధీప్యమానమైన రూపలావణ్యం వెనక ఓ షాడో దాగి ఉంది. ఆ షాడో గురించి తనే స్వయంగా ఓపెనైంది. గంట సేప్ జిమ్మింగ్ యోగా సెషన్స్ తన రూపం వెనక అసలు మ్యాజిక్ అని చెబుతోం ది. కత్రిన కైఫ్ తన వ్యాయామ దిన చర్యను తాజాగా అభిమానులతో పంచుకున్నారు. ఆశించిన రూపం దక్కాలంటే ఎవరైనా ఇది పాటించా ల్సిందేనంటూ తన ఫిట్నెస్ వెనుక ఉన్న రహస్యాన్ని వెల్లడించారు. ఆమె తన వ్యాయామ శిక్షకుడు ఇచ్చిన చేతి రాత వ్యాయామ దిన చర్యను షేర్ చేసింది. ఇందులో కాళ్ళు.. యాబ్స్ .. పై(అప్పర్) శరీరా నికి సంబంధించిన వ్యాయామాల వివరాలు ఉన్నాయి. వీటిలో స్క్వాట్స్.. లెగ్ ప్రెస్స్.. పుష్-అప్స్.. కార్డి యోలు ఇతర వర్కవుట్లలోన్నాయి. ఒక రోజు కోసం వర్కౌట్ డేటా ఇది! అని కత్రిన తన ధృవీకరించిన ఇన్ స్టాగ్రామ్ స్టోరీలో రాసింది. కత్రినా వర్కౌట్ విషయానికి వస్తే చాలా క్రమ శిక్షణ తో కూడుకున్నది .. తరచూ ఆమె వ్యాయామ వీడియోలను సోషల్ మీడియాలో పంచుకుంటుంది. కెరీర్ మ్యాటర్‌కి వస్తే.. కత్రిన తదుపరి రోహిత్ శెట్టి కాప్ యాక్షన్ డ్రామా సూర్య వంశీలో అక్షయ్ కుమార్ సరసన నటించింది. సిద్ధాం త్ చతుర్వేది-ఇషాన్ ఖట్టర్‌లతో కలిసి హారర్ కామెడీ ఫోన్‌భూత్‌లో నటిస్తోంది.

## అల్ట్రా స్టైలిష్ కాలేజ్ బోయ్‌లా మారాడు



ఏజ్ పెరిగినా కొందరి గ్లామర్ సర్ ప్రైజ్ చేస్తుంటుంది. టాలీవుడ్ కింగ్ నాగార్జున 50 ప్లస్ లో నూ ఛామింగ్ లుక్ స్టైలిష్ కంటెంట్ తో కట్టి పడేయడం ప్రతిసారీ చర్చకు వచ్చేది. ఇంటర్వ్యూల్లో ప్రతిసారీ నాగార్జున గ్లామర్ రహస్యం గురించి జర్నలిస్టులు ప్రశ్నించేవారంటే అర్థం చేసుకోవాలి. ఇప్పుడు సూపర్ స్టార్ మహేష్ అంతకుమించి యువతరం లో హాట్ టాపిక్ గా మారారు. ఆయన ఏజ్ లెస్ ఛామ్ ప్రస్తుతం ట్రెండీ టాపిక్ అవుతోంది. 45 ఏజ్ అంటే నమ్మడం కష్టమే. ఆయనకు 25 అంటే నమ్మేస్తారు. అంతగా అతడి మేకోవర్ సర్ ప్రైజ్ చేస్తోంది. ఇటీవల శ్రీమంతుడు- భరత్ అనే నేను-మహర్షి-సరిలేరు నీకెవ్వరు.. ఇలా వరుసగా ఏడాదికో సినిమా చేస్తుంటే సినిమా సినిమాకి ఏజ్ పెరుగుతున్నా.. అదేమీ కనిపించకుండా తగ్గించేస్తూ ఎంతో స్టైలిష్ గా ఛామింగ్ గా కనిపిస్తున్నారు అంటూ అభిమానులు సర్ ప్రైజ్ అవుతున్నారు. ప్రస్తుతం పరశురామ్ దర్శకత్వంలో సర్కార్ వారి పాట చిత్రీకరణ కోసం రెడీ అవుతున్నారు మహేష్. ఈలోగానే తాజాగా రివీలైన ఓ ఫోటోలో మహేష్ అల్ట్రా స్టైలిష్ లుక్ షాక్ కి గురి చేస్తోంది. ఆయనేమైనా కాలేజ్ బోయ్ నా? అంటూ అమ్మాయిలంతా ఒకటే ఇదైపోతున్నారు ఈ రూపం చూసి. వైట్ నెక్ టీస్ ధరించి కొంచెం పొడవాటి జుట్టుతో అల్ట్రా మోడ్రన్ గా కనిపించారు మహేష్. ఈ రూపం దేనికోసం అంటే.. ఒక వాణిజ్య ప్రకటన కోసం ఇలా రెడీ అయ్యారట. ఇటీవలే ఈ గెటప్ తో షూట్ చేసారు. ప్రస్తుతం ఈ ఫోటో అంతర్జాలంలో వైరల్ గా మారింది.

ఇక సర్కార్ వారి పాట జనవరి నుంచి సెట్స్ పైకి వెళ్లనుం ది. కీర్తి సురేష్ ఇందులో కథానా యిక. ఆగస్టు 2021 నాటికి విడుద లకు సిద్ధం చేస్తారు. ఇవే కాకుండా .. త్రివిక్రమ్ శ్రీనివాస్.. ఎస్.ఎస్. రాజమౌళి.. కొరటాల శివలతో మహేష్ సినిమాలు చేయనున్నారు.

## జక్కన్న అప్పటికి 'ఆర్.ఆర్.ఆర్' షూటింగ్ కంప్లీట్ చేస్తాడా..?



యావత్ సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాలలో 'ఆర్.ఆర్.ఆర్' ఒకటి. దర్శకధీరుడు రాజమౌళి తెరకెక్కిస్తున్న ఈ భారీ మల్టీస్టారర్ లో యంగ్ టైగర్ ఎన్టీఆర్ - మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ కలిసి నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఇద్దరి హీరోల ఎంట్రీ వీడియోస్ విశేషంగా ఆకట్టుకున్నాయి. కరోనా కారణంగా షూటింగ్ లేట్ అవడంతో ముందుగా చెప్పినట్లు వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేయలేకపోతున్నారు. కోవిడ్ నేపథ్యంలో తిరిగి షూటింగ్ ప్రారంభించిన రాజమౌళి శరవేగంగా చిత్రీకరణ జరుపుతున్నాడు. బ్రేక్ లేకుండా డే అండ్ నైట్ షూట్ చేస్తున్నాడు. ఇటీవలే ఓ భారీ షెడ్యూల్ పూర్తి చేసిన జక్కన్న.. మహాబలేశ్వర్‌లో చిన్న షెడ్యూల్‌ను ప్రారంభించిన సంగతి తెలిసిం దే. అయితే తాజా సమాచారం ప్రకారం మహాబలేశ్వర్ షూట్‌ని 'ఆర్.ఆర్. ఆర్' టీమ్ పూర్తి చేసినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా తదుపరి షెడ్యూల్ ను చిత్ర యూని ట్ హైదరాబాద్ లో ప్లాన్ చేసిందట. ఈ షెడ్యూల్‌లో చరణ్‌కి జోడీగా నటిస్తున్న బాలీవుడ్ బ్యూటీ ఆలియా భట్ కూడా పాల్గొనే అవకాశముందని టాక్ నడుస్తోంది. అలానే ఎట్టి పరిస్థితుల్లోనూ 2021 మార్చి నాటికి 'ఆర్.ఆర్.ఆర్' చిత్రీకరణ కంప్లీట్ చేయాలని జక్కన్న డిసైడైనట్లు సినీ వర్గాల్లో చెప్పుకుంటున్నారు. కాగా ఈ పాన్ ఇండియన్ ప్రాజెక్ట్‌లో అజ య్ దేవగన్ - శ్రియా - సముద్ర ఖని - ఆలియా భట్ - ఒలీవియా మోరి స్ వంటి స్టార్స్ ఇతర ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు. దీనికి కీరవాణి సంగీతం సమకూరుస్తుం డగా.. సెంథిల్ కుమార్ సినిమాటో గ్రాఫర్ గా వ్యవహరిస్తున్నారు. డీవీవీ దానయ్య భారీ బడ్జెట్ తో అత్యంత ప్రతిష్టాత్మకంగాఈచిత్రాన్ని నిర్మిస్తున్నారు.

## సత్యదేవ్ 'తిమ్మరుసు' ఫస్ట్ లుక్..!



'బ్రోచేవారెవరు రా' 'బ్లఫ్ మాస్టర్' 'ఉమామహేశ్వర ఉగ్రరూపస్య' చిత్రాలతో హీరోగా నిలదొక్కుకున్నాడు టాలెంటెడ్ యాక్టర్ సత్య దేవ్. ఆయన నటిస్తున్న తాజా చిత్రం "తిమ్మరుసు". 'అసైన్మెంట్ వాలి' అనేది దీనికి ఉపశీర్షిక. ఈ చిత్రానికి శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వం వహిస్తున్నారు. ఈస్ట్ కోస్ట్ ప్రొడక్షన్స్ మరియు ఎస్ ఒరిజినల్స్ బ్యానర్స్ పై మహేష్ కోనేరు - సృజన్ ఎరబోలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో సత్య దేవ్ సరసన 'టాక్సీవాలా' ఫేమ్ ప్రియాంక జవాల్కర్ కథానాయికగా నటిస్తోంది. వైవిధ్యమైన కథాంశంతో తెరకెక్కుతున్న 'తిమ్మరుసు' సినిమా ఫస్టలుక్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. 'తిమ్మరుసు' ఫస్ట్ లుక్ లో సత్యదేవ్ చేతిలో ఓ సూట్ కేస్ పట్టుకొని బైక్ పై కూర్చుని స్టైలిష్ గా కనిపిస్తున్నాడు. వైవిధ్యభరిత చిత్రాలు చేస్తూ వస్తున్న సత్యదేవ్ మరో కొత్త తరహా సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన టీజర్ ను డిసెంబర్ 9న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "తిమ్మరుసు సినిమా ఓ మంచి కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న చిత్రం. సత్యదేవ్ ను సరికొత్త కోణంలో ఆవిష్కరించే సినిమా ఇది. ఈరోజు ఫస్ట్ లుక్ ను విడుదల చేస్తున్నాం. డిసెంబర్ 9న టీజర్ ను విడుదల చేస్తాం. ఇప్పటికే చిత్రీకరణ దాదాపు పూర్తయ్యింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. త్వరలో ఇతర విషయాలు తెలియజేస్తాం" అని తెలిపారు. ఈ చిత్రానికి శ్రీ చరణ్ పాకల సంగీతం సమకూరుస్తుం డగా.. అప్పు ప్రభాకర్ కెమెరామెన్ గా వ్యవహరిస్తున్నారు. ఇందులో బ్రహ్మాజీ - అజయ్ - ప్రవీణ్ - ఆదర్శ్ బాలకృష్ణ - ఝాన్సీ - వైవా హర్ష - సంధ్యా - జనక్ తదితరులు నటిస్తున్నారు.

## భర్త బిజినెస్‌కి ప్రచారకర్తగా కాజల్



తన చిరకాల మిత్రుడు కం బిజినెస్ మేన్ గౌతమ్ కిచ్లుని చందమామ కాజల్ పెళ్లాడిన సంగతి తెలిసిందే. హనీమూన్ ముగియగానే కాజల్ తదుపరి షెడ్యూల్స్ పై దృష్టి సారించారు. ప్రస్తుతం ఆచార్య చిత్రీకరణ కోసం కాజల్ వెయిట్ చేస్తున్నారు. అంతేకాదు.. కాజల్ అగర్వాల్ తన భర్త కిచ్లుకి చెందిన ఇ-కామర్స్ సంస్థ డిస్కర్న్ లివింగ్‌కి ముఖచిత్రంగా మారనుందన్న సమాచారం అందింది. ఈ సంస్థ త్వరలోనే కాజల్ తో బ్రాండ్ పబ్లిసిటీకి సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించబోతోందిట. ఆ మేరకు వివరాల్ని కాజల్ స్వయంగా వరుస ట్వీట్లలో వెల్లడించారు. డిస్కెర్న్ లివింగ్ అనేది ముంబైకి చెందిన ఇ-కామర్స్ సంస్థ. ఇది ఇంటీరియర్ డిజైన్ గృహాలంకరణలో ప్రత్యేకత కలిగి ఉన్న సంస్థ. కాజల్ ఇటీవల తమ సంస్థ కు చెందిన ప్రకటన కోసం షూటింగ్ లోనూ పాల్గొన్నారు. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడవుతాయని భావిస్తున్నారు. ఇదిలావుండగా కాజల్ త్వరలో హైదరాబాద్ లో ఆచార్య సెట్స్ లో చేరనున్నాడు. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మెగాస్టార్ చిరంజీవి- కాజల్ నాయకానాయికలుగా నటిస్తుండగా రామ చరణ్ మరో కీలక పాత్రను పోషించనున్నారు.

## ఫైటర్' ఆలస్యంకు అసలు కారణం ఇదేనా?



విజయ్ దేవరకొండ హీరోగా అనన్య పాండే హీరోయిన్ గా పూరి జగన్నాద్ దర్శకత్వంలో రూపొందుతున్న 'ఫైటర్' మూవీ మార్చి లో కరోనా లాక్ డౌన్ కారణంగా షూటింగ్ నిలిచి పోయింది. 30 శాతంకు పైగా చిత్రీకరణ పూర్తి అయిన ఈ సినిమా షూటింగ్ ను పునః ప్రారంభించక పోవడం పట్ల అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. చిన్న హీరోల నుండి స్టార్ హీరోల వరకు అంతా కూడా షూటింగ్ లను ప్రారంభించారు. కాని ఇప్పటి వరకు విజయ్ మాత్రం తన ఫైటర్ సినిమాను మొదలు పెట్టక పోవడంతో ఆయన అభిమానులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సీనియర్ హీరోలు సైతం కరోనా భయం లేకుండా షూటింగ్ లో జాయిన్ అయితే విజయ్ దేవర కొండ ఎందుకు ఆలస్యం చేస్తున్నాడనే ప్రశ్న అందరిలో వ్యక్తం అవుతుంది. డిసెంబర్ మొదటి వారంలో షూటింగ్ ప్రారంభం అవ్వబోతుంది అనుకుంటే ఈ నెలలో కూడా షూటింగ్ లేదని తేలిపోయింది. జనవరి రెండవ వారంలో ఫైటర్ ను పునః ప్రారంభించే అవకాశం ఉందంటున్నారు. ఫైటర్ సినిమా కోసం విదేశీ ఫైటర్స్ కావాల్సి ఉంది. కరోనా పరిస్థితుల కారణంగా వారు వచ్చేందుకు ఇబ్బందులు ఉన్నాయి. అందుకే ఈ సినిమా నిర్మాణం పునః ప్రారంభం ఆలస్యం అవుతుంది అంటూ యూనిట్ సభ్యులు అనధికారికంగా చెబుతున్నారు. విజయ్ దేవరకొండ ఈ సినిమాతో బాలీవుడ్ ప్రేక్షకుల ముందుకు వెళ్లబోతున్నాడు. తెలుగుతో పాటు హిందీలో కూడా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. కొన్ని సీన్స్ హిందీ ప్రేక్షకుల కోసం విభిన్నంగా రూపొందించనున్నారట. ఈ సినిమా నిర్మాణంలో కరణ్ జోహార్ భాగస్వామిగా ఉండటం వల్ల అంచనాలు భారీగా ఉన్నాయి. అక్కడ ఇక్కడ కూడా సినిమా ఆకట్టుకుంటుందనే నమ్మకంతో ఇండస్ట్రీ వర్గాల వారు ఉన్నారు.

## సమంత సొంత డబ్బింగ్



ఒకవైపు పర్సనల్ లైఫ్‌ని.. మరోవైపు ప్రొఫెషనల్ లైఫ్‌ని చక్కగా బ్యాలెన్స్ చేసుకుంటూ వరుస విజయాలు అందుకుంటుంది సమంత అక్కినేని. సిల్వర్ స్క్రీన్‌పై హీరోయిన్‌గా పీక్స్ చూసిన సామ్.. ఇప్పుడు వెబ్ రంగంలోనూ రాణిస్తున్నారు. ఇప్పటికే 'ఆహా' కోసం 'సామ్ జామ్' చేస్తున్న సమంత.. త్వరలో 'ఫ్యామిలీ మేన్-2'తో దేశవ్యాప్తంగా ప్రేక్షకుల్ని పలకరించబోతున్నారు. అమెజాన్ పాపులర్ సిరీస్ 'ఫ్యామిలీ మేన్' సీజన్-2 లో నెగటివ్ షేడ్స్‌లో కనిపించబోతున్నారు సమంత. ఇప్పటివరకు హీరోయిన్‌గా తన క్యూట్ పెర్ఫామెన్స్‌తో సందడి చేసిన సామ్.. ఈ వెబ్ సిరీస్ కోసం తొలిసారి యాక్షన్ సీన్స్‌లోనూ చెలరేగిపోయిందట. 'ఫ్యామిలీ మేన్' సీజన్ -2 కోసం సమంత పలు భాషల్లో సొంత డబ్బింగ్ చెప్పుకుంది. అలా సామ్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న 'ద ఫ్యామిలీ మేన్-2' ఈ నెల నుంచే స్ట్రీమింగ్ అవ్వాల్సి ఉంది. కానీ వి.ఎఫ్.ఎక్స్ వర్క్ పూర్తవకపోవడంతో జనవరి లేదా ఫిబ్రవరి నుంచి ఈ సిరీస్ స్ట్రీమింగ్ కి రెడీ అవ్వబోతున్నట్టు తెలుస్తోంది. ఏది ఏమైనా 'ద ఫ్యామిలీ మేన్' పార్ట్ 2లో సమంత పాత్ర ఏ రీతిన మెప్పిస్తుందో చూడాలి.

Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989